శ్రీ క్రోధి నామ సంవత్సరం; దక్షిణాయణం; హేమంత రుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం నవమి: రా. 715 తదుపరి దశమి; హస్త: మ. 1231 తదుపరి చిత్త వర్జ్యం: రా. 923 నుంచి 1109 వరకు; అమృత ఘడియలు: ఉ. 738 వరకు; దుర్ముహూర్తం: ఉ. 842 నుంచి 926 వరకు తిరిగి రా. 1041 నుంచి 1133 వరకు; రాహుకాలం: సా. 300 నుంచి 430 వరకు సూర్యోదయం: ఉ. 6.31; సూర్యాస్తమయం: సా.5.28

# సిటీటైమ్స్
తెలుగు దినపత్రిక

## అల్లు అర్జున్ ఇంటిపై దాడి ఘటనలో నలుగురు కొడంగల్ వాసులు



**హైదరాబాద్:** సినీనటుడు అల్లు అర్జున్ ఇంటిపై దాడిని భాజపా ఎంపీ డీకే అరుణ ఖండించారు. దాడి ఘటనలో నలుగురు కొడంగల్ వాసులున్నారని ఆమె ఆరోపించారు. జైలు నుంచి విడుదలైన లగచర్ల రైతులను డీకే అరుణ పరామర్శించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. అల్లు అర్జున్ ఇంటిపై దాడి ఘటన నిందితుల్లో ఒకరు కాంగ్రెస్ జడ్పీటీసీగా పోటీ చేశారని.. ఆ పార్టీ నేతలే ఈ దాడి చేయించారనే అనుమానం కలుగుతోందన్నారు.

మంగళవారం- 24- డిసెంబర్ 2024 | సంపుటి : 25 సంచిక : 183 | పేజీలు - 8 వెల : రూ 3 | www. citytimes news.com

# ఎస్‌హెచ్‌జీలకు 231 ఎకరాల్లో సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు

### రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతి కుమారి
### రాష్ట్ర వ్యాప్తంగా 5 జిల్లాల్లో 231 ఎకరాల్లో సోలార్ పవర్ ప్లాంట్లు
### ఆలయ భూముల్లో మహిళా సంఘాలకు సౌర విద్యుత్ ప్లాంట్లు



**హైదరాబాద్,(సిటీ టైమ్స్):**
స్వయం సహాయక బృందాలకు (ఎస్‌హెచ్‌జీ) తొలి విడతలో 231 ఎకరాల్లో సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతి కుమారి తెలిపారు. ఎస్‌హెచ్‌జీలకు ఉపాధి కల్పన, సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, ఎలక్ట్రిక్ బస్సులు ఇవ్వడంపై సీఎస్ సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 5 జిల్లాల్లో 231 ఎకరాల్లో సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఆలయ భూముల్లో మహిళా సంఘాలకు సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకోసం 6 నెలల్లోగా చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎస్ ఆదేశించారు. మరోవైపు జిల్లా సమాఖ్య భవనాల నిర్మాణాలను వచ్చే ఏడాది జూన్ నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మాదాపూర్ ఇందిరా మహిళా శక్తి బజార్‌లో జనవరి 25లోపు 'సరస్ మేళా' ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.



# హైకోర్టులో కేసీఆర్, హరీశ్‌రావు క్వాష్ పిటిషన్లు

**హైదరాబాద్,(సిటీ టైమ్స్):**
తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు హైకోర్టులో క్వాష్ పిటిషన్లు దాఖలు చేశారు. మేడిగడ్డ నిర్మాణంలో అవినీతి జరిగిందన్న అంశంపై భూపాలపల్లి కోర్టు ఇచ్చిన నోటీసులను కొట్టివేయాలని కోరారు. మేడిగడ్డ నిర్మాణంలో ప్రమాణాలు పాటించలేదని, దీనివల్ల ప్రజాధనం వృథా అయ్యిందని రాజలింగమూర్తి అనే వ్యక్తి భూపాలపల్లి జిల్లా కోర్టులో గతంలో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జిల్లా న్యాయస్థానం జులై 10న కేసీఆర్, హరీశ్‌రావు సహా ఆరుగురికి నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులను సవాల్ చేస్తూ హైకోర్టులో కేసీఆర్, హరీశ్‌రావు తాజాగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై మంగళవారం హైకోర్టు విచారణ చేపట్టనుంది.

### పుష్ప సినిమాపై మంత్రి సీతక్క
# సంచలన కామెంట్స్



**హైదరాబాద్,(సిటీ టైమ్స్):**
తెలంగాణలో అల్లు అర్జున్, పుష్ప సినిమా విషయంలో రాజకీయ ప్రకంపనలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఇక, తాజాగా పుష్ప సినిమాపై మంత్రి మంత్రి సీతక్క సంచలన వ్యాఖ్యలు చేశారు.

(మిగతా 2 లో)

# రూ.8,440 కోట్లతో జీహెచ్ఎంసీ వార్షిక బడ్జెట్!

### గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ వార్షిక బడ్జెట్‌కు స్టాండింగ్ కమిటీ ఆమోదం



**హైదరాబాద్,(సిటీ టైమ్స్):**
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ వార్షిక బడ్జెట్‌కు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. 202526 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.8,440 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి తెలిపారు. మేయర్ అధ్యక్షతన కమిషనర్

(మిగతా 2 లో)

# బలపడుతోన్న బంగ్లా-పాక్ బంధం..

### కరాచీ నుంచి చిట్టగాంగ్‌కు నేరుగా నౌకలు



**ఢాకా,(సిటీ టైమ్స్):**
షేక్ హసీనా పదవికోల్పోయిన తర్వాత తాత్కాలిక సారథి నేతృత్వంలోని బంగ్లాదేశ్ విదేశాంగ విధానంలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. భారత్‌కు దూరం జరుగుతూ పాకిస్థాన్ అనుకూల వైఖరిని ప్రదర్శిస్తోంది. ఈ క్రమంలోనే రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు బలోపేతం అవుతున్నాయి. దానిలో భాగంగానే 53 ఏళ్లలో తొలిసారి గత నెల పాక్ నుంచి నేరుగా బంగ్లాకు తొలికార్గో షిప్ రాగా.. ఆదివారం మరో సరకు రవాణా నౌక చిట్టగాంగ్ పోర్ట్‌కు చేరుకుంది. పనామా జెండాతో ఉన్న ఆ రెండో నౌక 811 కంటైనర్లలో సోడాయాష్, మార్బుల్ బ్లాక్, ముడివస్త్రాలు, షుగర్, ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల వంటి వాటిని మోసుకొచ్చిందని స్థానిక మీడియా కథనం పేర్కొంది. ఈజిప్టులో పాక్ ప్రధాని షహబాజ్ షరీఫ్, బంగ్లా తాత్కాలిక సారథి మహమ్మద్ యూనస్ భేటీ జరిగిన గంటల వ్యవధిలోనే ఈ పరిణామం చోటుచేసుకుంది. రెండు దేశాల

(మిగతా 2 లో)



# పోలీసులే అతడ్ని చంపేశారు..

### పర్భణీ ఘటనపై రాహుల్ గాంధీ

**ముంబయి ,(సిటీ టైమ్స్):**
మహారాష్ట్ర పోలీసులపై కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఇటీవల పర్భణీలో జరిగిన అల్లర్లలో అరెస్టయిన వ్యక్తి మరణించడానికి పోలీసులే కారణమంటూ ఆయన ఆరోపించారు. అతడు ఒక దళితుడని.. రాజ్యాంగాన్ని పరిరక్షిస్తున్న ఆ వ్యక్తిని హత్య చేశారంటూ కీలక వ్యాఖ్యలు చేశారు.

**అసలేం జరిగిందంటే..**
మహారాష్ట్రలోని పర్భణీలో సిమెంట్‌తో తయారు చేసిన రాజ్యాంగ ప్రతి నమూనాను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీంతో అల్లర్లు చెలరేగాయి. ఈ ఘటనకు సంబంధించి ఒక వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అయినప్పటికీ నిరసనలు ఆగలేదు. పరిస్థితులు ఆందోళనకరంగా మారాయి. హింసాకాండకు పాల్పడ్డారని ఆరోపిస్తూ 50 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో న్యాయవిద్య చదువుతున్న సోమ్‌నాథ్ సూర్యవంశీ కూడా ఉన్నారు. కస్టడీలో ఉన్న

(మిగతా 2 లో)

### క్విక్ రెస్పాన్స్, టెక్నాలజీతో
# క్రైమ్ రేట్ తగ్గించాం

### రాచకొండ సీపీ



**హైదరాబాద్,(సిటీ టైమ్స్):**
విజిబుల్ పోలీసింగ్, క్విక్ రెస్పాన్స్, టెక్నాలజీని ఉపయోగించి క్రైమ్ రేటు తగ్గించామని రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. 2024లో మొత్తం 33,084 కేసులు నమోదయ్యాయని చెప్పారు. కమిషనరేట్ పరిధి నేర వార్షిక నివేదికను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడారు. "ఈ ఏడాది నమోదైన 33,084 కేసుల్లో 25,143 కేసులు పరిష్కరించాం.

(మిగతా 2 లో)

# పూర్తి పారదర్శక విధానంలో ఉద్యోగాలు

### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి




**హైదరాబాద్,(సిటీ టైమ్స్):**
అభ్యర్థుల ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలు కల్పిస్తున్నామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. చాంద్రాయణగుట్ట సీఆర్పీఎఫ్ గ్రూప్ సెంటర్‌లో రోజ్‌గార్ మేళా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కేంద్ర ఉద్యోగాలకు ఎంపికైన 526 మందికి ఆయన నియామక పత్రాలు అందజేశారు. దేశ వ్యాప్తంగా 71 వేల మందికి నేడు నియామక పత్రాలు అందజేస్తున్నట్లు చెప్పారు. పూర్తి పారదర్శక విధానంలో ఉద్యోగాలు

(మిగతా 2 లో)

# గాంధీభవన్‌కు వెళ్లిన అల్లు అర్జున్ మామ..

### స్పందించిన పీసీసీ అధ్యక్షుడు



**హైదరాబాద్,(సిటీ టైమ్స్):**
కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ దీపాదాస్ మున్షీని హీరో అల్లు అర్జున్ మామ, కాంగ్రెస్ నేత చంద్రశేఖర్ రెడ్డి గాంధీభవన్‌లో కలిశారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, సీడబ్ల్యూసీ సభ్యుడు కొప్పుల రాజు, దీపాదాస్ మున్షీ ఉన్నారనే సమాచారంతో అయన గాంధీభవన్‌కు వెళ్లారు. పీసీసీ అధ్యక్షుడు మీడియా సమావేశంలో ఉన్నందున దీపాదాస్ మున్షీని కలిసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న మహేశ్‌కుమార్ గౌడ్ చంద్రశేఖర్ రెడ్డికి ఫోన్ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. "అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ నేత. ఆయన నాకు మంచి స్నేహితుడు. చంద్రశేఖర్ రెడ్డి వచ్చినప్పుడు నేను మీడియా సమావేశంలో ఉన్నాను. దీపాదాస్ మున్షీని ఆయన కలిశారు. ఆమెతో చంద్రశేఖర్‌రెడ్డికి పెద్దగా పరిచయం లేకపోవడంతో తొందరగా మాట్లాడి వెళ్లిపోయారు. చంద్రశేఖర్‌కు ఫోన్ చేసి మాట్లాడాను. ఒకట్రెండు రోజుల్లో కూర్చొని మాట్లాడదాం అని చెప్పాను" అని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు.

### బుల్లెట్ ట్రైన్ కన్నా వేగంగా
# ద్రవ్యోల్బణం దూసుకెళ్తోంది

### నిత్యావసరాల ధరలు భారీ స్థాయిలో పెరుగుతున్నాయని.. కాంగ్రెస్ విమర్శ

2



# ప్రముఖ దర్శకుడు శ్యామ్ బెనెగల్ కన్నుమూత



**హైదరాబాద్:**

ప్రముఖ దర్శకుడు శ్యామ్ బెనెగల్ (90) కన్నుమూశారు. కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన.. ముంబయిలోని ఓ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ సోమవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని ఆయన కుటుంబ సభ్యులు ధ్రువీకరించారు. శ్యామ్‌బెనెగల్‌కు భార్య నీరా బెనెగల్, కుమార్తె పియా బెనెగల్ ఉన్నారు. ఇటీవలే 90వ వసంతంలోకి అడుగుపెట్టిన ఆయన.. రెండు, మూడు ప్రాజెక్టులు చేస్తున్నట్లు ఆ సందర్భంలో వెల్లడించారు. అయితే, కొన్నేళ్లుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో తీవ్రంగా బాధపడుతున్నట్లు ఆయన కుమార్తె వెల్లడించారు. శ్యామ్ బెనెగల్‌గా ప్రఖ్యాతిగాంచిన బెనగల్ల శ్యామ్‌సుందరరావు హైదరాబాద్‌లోని తిరుమలగిరిలో 1934 డిసెంబర్ 14న జన్మించారు. సికింద్రాబాద్ మహబూబ్ కళాశాలలో విద్యాభ్యాసం చేశారు. ఉస్మానియా వర్సిటీ నుంచి ఆర్థికశాస్త్రంలో ఎంఏ పట్టా అందుకున్నారు. చిన్నప్పట్నుంచే సినిమాల పట్ల ఆసక్తిని పెంచుకున్న శ్యామ్ బెనెగల్.. 1959లో ముంబయిలో ఓ యాడ్ ఏజెన్సీలో కాపీరైటర్‌గా పనిచేశారు. మరో సంస్థలో క్రియేటివ్ హెడ్‌గా కొనసాగారు. 1962లో తొలి డాక్యుమెంటరీ (గుజరాతీ) రూపొందించారు. దశాబ్దం తర్వాత ఫీచర్ ఫిల్మ్‌ను ఆయన తెరకెక్కించారు. అలా.. సినీరంగంలో అంచెలంచెలుగా ఎదిగి గొప్ప చిత్రాలు తీయడం ద్వారా ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం అందుకున్నారు. సినీ రంగంలో తన అపూర్వ సేవలకు గాను 1976లో పద్మశ్రీ, 1991లో పద్మభూషణ్, 2003లో ఇందిరా గాంధీ జాతీయ సమైక్యత పురస్కారం, 2013లో ఏఎన్ఆర్ జాతీయ అవార్డు, ఎనిమిది సార్లు జాతీయ అవార్డులు వరించాయి. అనంత్ నాగ్, షబానా అజ్మీ ప్రధాన పాత్రలో రూపొందిన 'అంకుర్' చిత్రం సెకండ్ బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ కేటగిరీలో జాతీయ అవార్డును అందుకుంది. 'నిషాంత్', 'మంథన్', 'భూమిక', 'సమర్', 'హరి భరీ', 'మండి'.. ఇలా బెనెగల్ దర్శకత్వం వహించిన దాదాపు అన్ని సినిమాలూ అవార్డులు దక్కించుకోవడం విశేషం. ఆయన డైరెక్షన్‌లో వచ్చిన చివరి చిత్రం 'ముజిబ్: ది మేకింగ్ ఆఫ్ ఏ నేషన్' గతేడాది విడుదలైంది. పలు లఘు చిత్రాలు, ధారావాహికలకూ బెనెగల్ దర్శకత్వం వహించి తనదైన ముద్ర వేశారు. ఈ లెజెండరీ దర్శకుడి మరణం పట్ల పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు సంతాపం వ్యక్తంచేస్తూ పోస్టులు పెడుతున్నారు.

# బలపడుతోన్న బంగ్లా-పాక్ బంధం..



(మొదటి పేజీ తరువాయి)

మధ్య సంబంధాలు బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ఆ సమావేశంలో ఇద్దరు నేతలు అంగీకారానికి వచ్చారు.

**షిప్పింగ్ ఒప్పందాన్ని సమీక్షించనున్న బంగ్లా..!**

బంగాళాఖాతంలో ఉన్న చిట్టగాంగ్ పోర్ట్ వ్యూహాత్మకంగా కీలకమైంది. షేక్ హసీనా నేతృత్వంలోని మునుపటి బంగ్లా సర్కార్‌తో ఉన్న మైత్రి కారణంగా ఆ పోర్టు కార్యకలాపాలపై భారత్ ఓ కన్నేసి ఉంచేది. దానివల్లే 2004లో 1500బాక్సుల చైనా ఆయుధాలను స్వాధీనం చేసుకోగలిగింది. ఆ సరకు రవాణా వెనక పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ సూత్రధారి అని, వాటిని భారత్‌లోని ఉగ్రసంస్థ ఉల్ఫాకు అందించడం కోసమనే ఆరోపణలు వచ్చాయి. అయితే ఇప్పుడు చిట్టగాంగ్, మోంగ్లా పోర్టులను వినియోగించుకునేందుకు వీలు కల్పించేలా రెండు దేశాల మధ్య ఉన్న షిప్పింగ్ ఒప్పందాన్ని యూనస్ సర్కార్ సమీక్షించనున్నట్లు తెలుస్తోంది. హసీనా ప్రభుత్వం ఉన్నప్పుడు పాకిస్థాన్ నుంచి వచ్చే కార్గోను భౌతికంగా తనిఖీ చేయాలనే నిబంధన ఉండేది. ప్రస్తుత ప్రభుత్వం దానిని తొలగించింది. దాంతో కార్గో తరలింపు పాక్ నౌకలకు సులభం కానుంది. అప్పట్లో పాక్ నుంచి వచ్చే సరకు మలేషియా, సింగపూర్, శ్రీలంకలో అన్‌లోడ్ చేసేవారు. తర్వాత ఆ లోడ్‌ను వేరే నౌకల్లోకి ఎక్కించి బంగ్లాకు తెప్పించేవారు. అయితే ప్రస్తుతం ఆ నిబంధనను ఎత్తివేయడంతో సరకు రవాణా ముసుగులో ఈశాన్యరాష్ట్రాల్లోని వేర్పాటు గ్రూపులకు ఆయుధాలు అందొచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది.

**పౌస్‌మేళాలో ఆసక్తి చూపని బంగ్లా ట్రేడర్..**

పశ్చిమబెంగాల్‌లోని శాంతినికేతన్‌లో ప్రతి ఏడాది డిసెంబర్ నెలలో పౌస్ మేళా (పౌస్ అంటే బెంగాలీ మాసం) జరుగుతుంటుంది. దానికి మనదేశంలోని వ్యాపారులతో పాటు బంగ్లా, నేపాల్, భూటాన్‌కు చెందిన వ్యాపారులు స్టాల్స్ ఏర్పాటు చేస్తుంటారు. ఈసారి స్టాల్ ఏర్పాటు ముందుస్తు అనుమతి కోసం బంగ్లాదేశ్ నుంచి ఎవరు దరఖాస్తు చేసుకోకపోవడం గమనార్హం. 1892లో రవీంద్రనాథ్ ఠాగూర్ తండ్రి దేవేంద్రనాథ్ ఈ మేళాను ప్రారంభించారు. తర్వాత దీనికి ప్రాచుర్యం లభించడంతో శాంతినికేతన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిఏటా నిర్వహిస్తున్నారు. ఆరు రోజులపాటు జరిగే ఈ మేళాకు సుమారు 20 లక్షల మందివరకు సందర్శకులు వస్తుంటారు. బంగ్లాలో ప్రచురితమైన పుస్తకాలు, అక్కడి చీరలు, ఇతర వస్త్రాలను ఆ స్టాల్స్‌లో ప్రదర్శించేవారు. ఇదిలా ఉంటే.. గతంలో పాక్, బంగ్లా ఒకేదేశంగా ఉండేవి. నాటి పశ్చిమ పాకిస్థాన్ అణచివేతలను భారత్ సాయంతో ఎదిరించిన తూర్పు పాకిస్థాన్ 1971లో బంగ్లాదేశ్‌గా ఆవిర్భవించిన విషయం తెలిసిందే.

## పుష్ప సినిమాపై మంత్రి సీతక్క

# సంచలన కామెంట్స్



(మొదటి పేజీ తరువాయి)

ఒక స్మగ్లర్ సినిమాకు అవార్డు ఇవ్వడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. మంత్రి సీతక్క తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. అల్లు అర్జున్ నటించిన పుష్ప సినిమాలో స్మగ్లర్‌ను హీరో చేశారు.. పోలీసును విలన్ చేశారు. ఒక స్మగ్లర్ పోలీసుల దుస్తులు విప్పి నిలబెడితే జాతీయ స్థాయిలో అవార్డులు ఇవ్వడం దేనికి సంకేతం. ఇలాంటి సినిమాలు నేర ప్రవృత్తిని పెంచేలా ఉన్నాయి. మానవతా దృక్పథం ఉన్న సినిమాలు రావాలి. జైభీమ్ వంటి సందేశాత్మక చిత్రాలకు అవార్డులు రాలేదు. అలాంటి సినిమాలకు ప్రోత్సహకాలు లేవు అంటూ ఘాటు విమర్శలు చేశారు. ఇదిలా ఉండగా పుష్ప2 సినిమా రిలీజ్ సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనలో ఒక మహిళ మృతి చెందింది. ఈ ఘటనపై కేసు నమోదు కాగా.. అల్లు అర్జున్ అరెస్టై జైలుకు కూడా వెళ్లి.. మధ్యంతర బెయిల్ మీద బయటకు వచ్చారు. అయితే ఈ వ్యవహారం తెలంగాణ రాజకీయంగానూ రచ్చ రేపింది. ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు అల్లు అర్జున్‌కు మద్దతుగా నిలిచాయి. రేవంత్ సర్కార్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నాయి. అయితే.. కాంగ్రెస్ మాత్రం పోలీసుల చర్యలను సమర్థిస్తూ..అల్లు అర్జున్‌దే మొత్తం తప్పు అంటూ వాదిస్తూ వస్తోంది. దీంతో, ఈ వ్యవహారంలో రోజుకో కొత్త ట్విస్ట్ చోటుచేసుకుంటోంది.



## బుల్లెట్ ట్రైన్ కన్నా వేగంగా

# ద్రవ్యోల్బణం దూసుకెళ్తోంది

(మొదటి పేజీ తరువాయి)

దేశంలో నిత్యావసరాల ధరలు భారీ స్థాయిలో పెరుగుతున్నాయని.. ఇందుకు మోదీ ప్రభుత్వ విధానాలే కారణమని కాంగ్రెస్ ఆరోపించింది. మోదీ ప్రభుత్వం ప్రకటించిన బుల్లెట్ ట్రైన్ ఇంకా రాలేదు కానీ.., ద్రవ్యోల్బణం మాత్రం ఆ రైలుకన్నా వేగంగా దూసుకెళ్తోందని విమర్శించింది. దీంతో సామాన్యుడి వెన్ను విరుగుతోందని.. ఈ విషయంపై ప్రజలకు సమాధానాలు చెప్పాలని డిమాండ్ చేసింది. ''మోదీ ప్రభుత్వం ప్రకటించిన బుల్లెట్ ట్రైన్ ఇంకా రాలేదు కానీ.., ద్రవ్యోల్బణం మాత్రం ఆ రైలుకన్నా వేగంగా దూసుకెళ్తోంది. గత పదిన్నరేళ్లలో ద్రవ్యోల్బణం రెండు మూడు రెట్లు పెరిగింది. కూరగాయలు, వంట నూనె, నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోతున్నాయి. మోదీ ప్రభుత్వంలో ప్రతి ఒక్కటీ ఖరీదై పోతోంది. టమాటాల నుంచి ఆలుగడ్డల వరకు, నూనెలు, పాలు.. సామాన్యులకు దూరమవుతున్నాయి'' అని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు.

**వారానికి 4 రోజుల పనే..: నారాయణమూర్తి '70 పని గంటల'కు ఎంపీ కౌంటర్**

మీరు వాగ్దానం చేసిన మంచి రోజులంటే ఇవేనా? అని 'ఎక్స్' వేదికగా కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఆయన.. ప్రజలు సమాధానం కోరుకుంటున్నారని అన్నారు. అంతేకాని వాక్చాతుర్యం కాదన్నారు. నిత్యావసర ధరలు రోజురోజుకు పెరుగుతున్నట్లు మీడియాలో వచ్చిన కథనాలను షేర్ చేసిన జైరాం రమేశ్.. కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగట్టారు.



# పోలీసులే అతడ్నిచంపేశారు..

## పర్భణీ ఘటనపై రాహుల్ గాంధీ

(మొదటి పేజీ తరువాయి)

అతడికి ఛాతీలో నొప్పి రావడంతో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు ప్రాణాలు కోల్పోయాడు. తాజాగా బాధిత కుటుంబాన్ని రాహుల్ గాంధీ పరామర్శించారు. అనంతరం.. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులపై తీవ్ర ఆరోపణలు చేశారు.

**ఇది కస్టోడియల్ డెత్..**

''సోమ్‌నాథ్‌ది కస్టోడియల్ డెత్. పోలీసులే అతడ్ని చంపేశారు. అతడు రాజ్యాంగాన్ని పరిరక్షిస్తున్నాడని ఆ వ్యక్తిని హత్య చేశారు. అసెంబ్లీలోనూ సీఎం దేవేంద్ర ఫడణవీస్ ఈ ఘటన గురించి అవాస్తవాలు మాట్లాడారు. రాజ్యాంగాన్ని నాశనం చేయడమే ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం. దీనికి సీఎం ఫడణవీస్ కూడా బాధ్యత వహించాలి. ఇది రాజకీయం చేయాల్సిన సమయం కాదు. ఒక వ్యక్తి హత్యకు గురయ్యాడు. కాబట్టి చర్యలు తీసుకోవాలి. దీనికి బాధ్యులైన వారిని కఠిన శిక్షించాలి'' అని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.

# పూర్తి పారదర్శక విధానంలో ఉద్యోగాలు



(మొదటి పేజీ తరువాయి)

కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. దళారుల మాట విని మోసపోవద్దని ఉద్యోగార్థులకు సూచించారు.

**అభివృద్ధి, సంక్షేమం అందరికీ చేరాలన్నదే మా ఆకాంక్ష: బండి సంజయ్**

అభివృద్ధి, సంక్షేమం అందరికీ చేరాలన్నదే తమ ఆకాంక్ష అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. హకీంపేట్‌లోని నిసా కేంద్రంలో నిర్వహించిన రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కేంద్ర ఉద్యోగాలకు ఎంపికైన 340 మందికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే 8.50 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చామన్నారు. 10 లక్షల మందికి ఉద్యోగాలు ఇవ్వాలనేది కేంద్ర ప్రభుత్వం లక్ష్యమన్నారు. కేంద్ర ఉద్యోగాల్లో అన్ని శాఖల ఖాళీలు భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# రూ.8,440 కోట్లతో జీహెచ్ఎంసీ వార్షిక బడ్జెట్!

(మొదటి పేజీ తరువాయి)

ఇలంబర్తి సమక్షంలో సమావేశమైన స్టాండింగ్ కమిటీ.. బడ్జెట్ అంచనాలపై విస్తృతంగా చర్చించింది. పలు విభాగాలకు సంబంధించి సభ్యులు అడిగిన సందేహాలను ఆయా విభాగాల అధికారులు నివృత్తి చేశారు. దీంతో స్టాండింగ్ కమిటీ....రూ.8,440 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం తెలిపింది. రెవెన్యూ రాబడులు రూ.4,445 కోట్లు, రెవెన్యూ వ్యయం రూ.4 వేల కోట్లగా అంచనా వేశారు. రూ.445 కోట్ల రెవెన్యూ మిగులు చూపారు. హెచ్‌సిటీ కింద రాష్ట్ర ప్రభుత్వం జీహెచ్ఎంసీకి రూ.2,654 కోట్లు గ్రాంట్ రూపంలో కేటాయించినట్లు విజయలక్ష్మి పేర్కొన్నారు. 202425లో రెవెన్యూ రాబడులను రూ.5,938 కోట్ల నుంచి రూ. 4,052 కోట్లకు సవరించినట్లు తెలిపారు. ఆమోదిత బడ్జెట్ నుంచి ఘన వ్యర్థాల నిర్వహణకు రూ.687 కోట్లు, వీధి దీపాల కోసం రూ.186 కోట్లు, భూసేకరణ కోసం రూ.283 కోట్లు, ఎస్ఎన్‌డీపీ కింద రూ.408 కోట్లు, హెచ్‌సిటీ కోసం రూ.1,690 కోట్లు, గ్రీన్ బడ్జెట్‌కు రూ.344 కోట్లు కేటాయించబోతున్నట్లు మేయర్ తెలిపారు.





# ఆ ఘటనను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు భాజపా యత్నం : విజయశాంతి

**హైదరాబాద్:** సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై సినీ నటి, కాంగ్రెస్ నాయకురాలు మాజీ ఎంపీ విజయశాంతి స్పందించారు. ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమన్నారు. దీనిపై తెలంగాణ సీఎం రేవంత్‌పై కేంద్రమంత్రులు ఆరోపణలు చేయడం గర్హనీయమంటూ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. ''ఒక సినిమా విడుదల సందర్భంగా జరిగిన సంఘటన దురదృష్టకరం. ఈ ఘటనను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు భాజపా నేతలు యత్నిస్తున్నారు. ఆ పార్టీకి చెందిన తెలుగు రాష్ట్రాల నేతల ప్రకటనల్లో ఇది కనిపిస్తోంది. సినిమా పరిశ్రమను నాశనం చేసేందుకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం ప్రయత్నిస్తున్నారంటూ భాజపా కేంద్రమంత్రులు ఆరోపణలు చేయడం గర్హనీయం. సినీ పరిశ్రమకు అన్ని ప్రాంతాల ప్రజల ఆదరణ కావాలి. ఇలాంటి ఘటనలు జరగకుండా సమస్యను పరిష్కరించుకునేందుకు ప్రయత్నం చేయాలి' అని పేర్కొన్నారు. ఇక 'పుష్ప2' సినిమా రిలీజ్ సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన రాజకీయంగానూ చర్చనీయాంశం అయింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా దీని గురించి మాట్లాడారు. ప్రతిపక్షాల విమర్శలు, సినిమా పరిశ్రమ వ్యవహారశైలి పైనా మాట్లాడారు. కాగా, సీఎం వ్యాఖ్యలపై అల్లు అర్జున్ ప్రెస్‌మీట్ పెట్టి తన క్యారెక్టర్‌ను తక్కువ చేసి చూపించే ప్రయత్నం జరుగుతోందన్నారు.

## సీవీ ఆనంద్ క్షమాపణలు..

# సహనాన్ని కోల్పోయానంటూ పోస్ట్



**హైదరాబాద్:** హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ క్షమాపణలు చెప్పారు. నేషనల్ మీడియాను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు పోస్ట్ పెట్టారు. సంధ్య థియేటర్ ఘటనపై జాతీయ మీడియా ప్రశ్నలు అడిగినప్పుడు తాను సహనాన్ని కోల్పోయినట్లు తెలిపారు. సంధ్య థియేటర్ వద్ద అసలేం జరిగిందో తెలుపుతూ నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ తాజాగా ప్రెస్‌మీట్ నిర్వహించిన సంగతి తెలిసిందే. థియేటర్‌లో ఆరోజు ఏం జరిగిందో తెలుపుతూ కొన్ని వీడియోలను విడుదల చేశారు. ఈక్రమంలో మీడియా ఆయన్ను కొన్ని విషయాలపై ప్రశ్నించగా.. నేషనల్ మీడియా ఈ ఘటనకు మద్దతు ఇస్తుందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. దీంతో అక్కడ ఉన్న కొందరు జర్నలిస్టులు ఈ ఆరోపణలను తప్పుపట్టారు. తాజాగా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు సీవీ ఆనంద్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. ''ఈ ఘటనపై విచారణ జరుగుతోంది. ప్రెస్‌మీట్‌లో రెచ్చగొట్టే ప్రశ్నలు వేయడంతో నేను కాస్త సహనాన్ని కోల్పోయాను. పరిస్థితులు ఎలా ఉన్నా సంయమనం పాటించాల్సి ఉంటుంది. నేను చేసింది పొరబాటుగా భావిస్తున్నాను. నేషనల్ మీడియాపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నా. క్షమాపణలు కోరుతున్నా'' అని తెలిపారు.

**రేవంత్ సర్కారు నిర్ణయం.. సంక్రాంతి సినిమా లెక్కలు తారుమారు..**

మరోవైపు సంధ్య థియేటర్ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని, న్యాయపరమైన సలహాలు తీసుకుని ముందుకెళ్తామని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. డిసెంబరు 4న సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనపై మీడియా అడిగిన ప్రశ్నలకు సీపీ సమాధానమిచ్చారు. ఘటనకు సంబంధించిన సీసీ ఫుటేజ్‌ను ఆయన విడుదల చేశారు. ఇక ఈ ఘటనపై తాజాగా సినీ నటి, కాంగ్రెస్ నాయకురాలు మాజీ ఎంపీ విజయశాంతి స్పందించారు. ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమన్నారు. దీనిపై తెలంగాణ సీఎం రేవంత్‌పై కేంద్రమంత్రులు ఆరోపణలు చేయడం గర్హనీయమన్నారు. ఈ ఘటనను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు భాజపా నేతలు యత్నిస్తున్నారన్నారు. సినీ పరిశ్రమకు అన్ని ప్రాంతాల ప్రజల ఆదరణ కావాలని.. ఇలాంటి ఘటనలు జరగకుండా సమస్యను పరిష్కరించుకునేందుకు ప్రయత్నం చేయాలని సూచించారు.

## క్విక్ రెస్పాన్స్, టెక్నాలజీతో

# క్రైమ్ రేట్ తగ్గించాం



(మొదటి పేజీ తరువాయి)

3 షిఫ్టుల్లో పెట్రోలింగ్ ఏర్పాటు చేశాం. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించాం. ఈ ఏడాది రాష్ట్రంలో అత్యధిక కేసులను పరిష్కరించిన కమిషనరేట్‌గా రాచకొండ నిలిచింది. మా పరిధిలో నమోదైన కేసుల్లో 30 మందికి జీవిత ఖైదు శిక్ష పడింది. అందులోనూ అగ్రస్థానంలో నిలిచాం. సంచలనం సృష్టించిన మోటకొండూరు పీఎస్ పరిధిలో 14 మంది నిందితులకు జీవిత ఖైదు పడింది. వివిధ కేసుల్లో 160 మందికి శిక్ష ఖరారైంది.

**సైబర్ బాధితులకు రూ.22 కోట్ల రిఫండ్**

లోక్ అదాలత్‌లో 11,440 కేసులతో పాటు 70,791 పెట్టీ కేసులు పరిష్కారమయ్యాయి. ఈ ఏడాది డయల్ 100 ద్వారా 2,41,742 ఫిర్యాదులు వచ్చాయి. అన్ని విభాగాల్లో కలిపితే క్రైమ్ రేటు 4% మాత్రమే పెరిగింది. గతేడాదితో పోలిస్తే హత్యకేసుల్లో ఎలాంటి మార్పు లేదు. చోరీ కేసులు 6%, డొమెస్టిక్ వయిలెన్స్ కేసులు 23% తగ్గాయి. రూ.88.25 కోట్ల విలువైన డ్రగ్స్‌ను సీజ్ చేశాం. మొత్తం 521 మంది డ్రగ్ నేరస్థులను అరెస్ట్ చేశాం. ఆ నిందితులపై 165 రౌడీషీట్లు ఓపెన్ చేశాం. ఎన్నికల సందర్భంగా రూ.16 కోట్ల నగదు, మద్యం సీజ్ చేశాం. సైబర్ బాధితులకు రూ.22 కోట్లు రిఫండ్ అయ్యేలా చర్యలు చేపట్టాం.

**మోహన్‌బాబుకు నోటీసులు ఇస్తాం**

కమిషనరేట్ పరిధిలో హద్దు దాటే బౌన్సర్లపై తీవ్ర చర్యలు ఉంటాయి. భయానక వాతావరణాన్ని సృష్టించడంతో పాటు ప్రజలను ఇబ్బందులకు గురిచేసి దురుసుగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయి. సినీనటుడు మోహన్‌బాబు కేసు దర్యాప్తు కొనసాగుతోంది. ఇది కోర్టు పరిధిలో ఉంది. హైకోర్టు ఆయనకు ఈనెల 24 వరకు గడువు ఇచ్చింది. ఆ తర్వాత నోటీసులు ఇచ్చి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం'' అని సీపీ సుధీర్‌బాబు తెలిపారు.

# పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు చేయూత

**సంధయ్య మెమోరియల్ ట్రస్ట్ కృషి అభినందనీయం**
**-చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి**
**పేద విద్యార్థి చదువుకొని ఉన్నతంగా ఎదగాలి**
**-బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్**
**ప్రైవేట్ కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి**
**-గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి**



**శేరిలింగంపల్లి,సిటీటైమ్స్:** పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు చేయూతనందిస్తున్న సంధయ్య మెమోరియల్ ట్రస్ట్ వారి కృషి అభినందనీయమని చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రశంసించారు. సోమవారం శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని రాయదుర్గం గ్రామం ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఖాజాగూడ జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సందయ్య మెమోరియల్ ట్రస్ట్, ఆర్ కే వై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 10వ తరగతి విద్యార్థిని,విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమానికి చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్చార్జి సందయ్య మెమోరియల్ ట్రస్ట్ సెక్రటరీ రవికుమార్ యాదవ్, గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డిలు ముఖ్య అతిథిలుగా హాజరై విద్యార్థిని, విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ స్టడీ మెటిరీయల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. పేద విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, పదవ తరగతి విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం సంధయ్య మెమోరియల్ ట్రస్ట్ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. అనంతరం రవి కుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి పదవ తరగతి పరీక్షలు అత్యంత కీలకమని, విద్యార్థులకు అన్ని సబ్జెక్టులు కలిపి ఆల్ ఇన్ వన్ గా మోడల్ ప్రశ్న పత్రాలు సంబంధించిన బుక్లెట్ అందజేయడం వలన పదవ తరగతి పరీక్షలలో విద్యార్థులు ఉన్నతమైన మార్కులు సాధించడానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.కష్టపడి చదివితే రానున్న జీవితంలో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. తదంతరం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అవసరమైన అన్ని మాలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి మరింత మంది దాతలు ముందుకు వచ్చి పాఠశాలను అభివృద్ధి పరిచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినప్పుడే మా కృషికి మంచి ఫలితం దక్కినట్టవుతుందన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తేజ బాబు, రాజశేఖర్,సీనియర్ నాయకులు, స్థానిక నేతలు,ప్రముఖులు, విద్యార్థులు,పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలి

**దేశ ప్రజలకి క్షమాపణలు చెప్పాలి**
**-నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి**

**కుత్బుల్లాపూర్, సిటీటైమ్స్:** కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురించి చేసినటువంటి అనుచిత వ్యాఖ్యలను ఖండించారు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రెస్ మీట్ ద్వారా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్‌ను కించపరిచేలా దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీసిన అమిత్ షా చేసిన వ్యాఖ్యలను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అంబేద్కర్‌ను అవమానిస్తే దేశం సహించబోదన్నారు. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. మతోన్మాద మంత్రికి బుద్ధి ప్రసాదించాలని వారు ఎద్దేవా చేశారు. దేశానికి దిశా నిర్దేశం చేసిన అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పి తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా దళిత సేన అధ్యక్షులు డాక్టర్ అవిజె జేమ్స్, డీసీసీ ఉపాధ్యక్షులు దమ్మని శ్రవణ్ కుమార్ ముదిరాజ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోలన్ శ్రీనివాస్ రెడ్డి, గడ్డం రాజేందర్ రెడ్డి, కోలన్ రాజశేఖర్ రెడ్డి, డివిజన్ మాజీ కార్పొరేటర్ పాల క్రిష్ణ, బహదురుపల్లి మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షులు బేకు శ్రీనివాస్, సోమన్నగారి శ్రీధర్ రెడ్డి, గణేష్, పండరి రావు, ఎండి లాయక్, సంతోష్ ముదిరాజ్, ఇరుగు రాధాక్రిష్ణ ,జెస్సీ పల్, ప్రేమ్ సాగర్, శ్రీశైలం యాదవ్, పుల్లెం రాజు, సంపంగి వెంకటేష్, షఫీ, భాస్కర్ రెడ్డి, రాజు చారి, పద్మ రావు, శ్రీనివాస్ గుప్తా, సురేందర్ రెడ్డి, అజయ్, గఫ్ఫార్, రవీందర్ నాయక్, అజీమ్, కార్యకర్తలు పాల్గొన్నారు.



## డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ సామాజిక బాధ్యత ఇంటర్న్ షిప్

**పూర్తి చేసిన జెఎన్టియు విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం**
**అభినందించిన ప్రొఫెసర్ దార్ల వెంకటేశ్వర రావు**

**శేరిలింగంపల్లి,సిటీటైమ్స్:** జెఎన్టియు విద్యార్థులు డ్రీం ఫర్ గుడ్ సొసైటీ లాంటి ఎన్జిఓ సంస్థలో ఇంటర్న్ షిప్ చేయడం అభినందనీయమని హెచ్సియు తెలుగు ప్రొఫెసర్ దార్ల వెంకటేశ్వర రావు అన్నారు. వెంకటరమణ కాలనీ (గోకుల్ ఫ్లాట్స్ )లో గల డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీలో సామాజిక బాధ్యత అనే అంశంపై జెఎన్టియు (యుసిఎంహెచ్), బిబిఎ విద్యార్థులు ఇంటర్న్ షిప్ పూర్తి చేశారు. ఈ సందర్బంగా ఇంటర్న్ షిప్ పూర్తి చేసిన విద్యార్థులకు హెచ్సియు తెలుగు ప్రొఫెసర్ దార్ల వెంకటేశ్వర రావు ముఖ్యఅతిథిగా పాల్గొని, వారికి సర్టిఫికెట్స్ అందచేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విధంగా సామాజిక బాధ్యతలో పాల్గొనడమే కాకుండా ఆ తరువాత కూడా సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అప్పుడే ఈ కార్యకమానికి న్యాయం చేసిన వారావుతారని అన్నారు. డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ వారు ఇటువంటి కార్యక్రమాల్ని చేపట్టి అటు జెఎన్టియు విద్యార్థులకు అవకాశం కల్పిస్తూ, డ్రీమ్ లో చదువుకునే విద్యార్థులకు కూడా వాళ్ళతో చదువు చెప్పించడం, సామాజిక బాధ్యతలు తెలియచేయడం అభినందనీయమన్నారు. అట్లాగే ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న హెచ్ సియు తెలుగు అసోసియేట్ ప్రొఫసర్ పి విజయకుమార్ మాట్లాడుతూ.. జెఎన్టియు విద్యార్థులు ఇటువంటి ఇంటర్న్ షిప్ లు మరిన్ని చేయాలని, అవి కూడా బాధ్యతాయుతంగా చేసినప్పుడే మీరు సమాజంలో మంచి గుర్తింపు పొందుతారని అన్నారు. ఇటువంటి అవకాశాలు కల్పించిన డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ కి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ సభ్యులు చావా అరుణ, కళ్యాణి, పద్మావతి, డాక్టర్ దేవయాని, నందిని తదితరులు పాల్గొన్నారు.



## దిగ్విజయంగా ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ మేనేజ్‌మెంట్ శిక్షణ

**సెర్ప్ సహకారంతో మరో 5 బ్యాచ్ శిక్షణలకు సిద్ధమైన నిథిమ్**

**శేరిలింగంపల్లి, సిటీటైమ్స్:** గచ్చిబౌలి లోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్ మెంట్ (నిథిమ్) లో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ మేనేజ్ మెంట్ శిక్షణను డిసెంబర్ 14 నుండి 23వ, 24వరకు విజయవంతంగా బ్యాచ్ 5లో 28 మంది అభ్యర్థులు శిక్షణ పొందారని నిర్వాహకులు పేర్కొన్నారు. సోమవారం వారు మాట్లాడూతూ.. ఇప్పటి వరకు మొత్తం 137 మంది మహిళలు శిక్షణ పొందారని, రాబోయే సంవత్సరంలో మరో 5 బ్యాచ్‌లకు శిక్షణ ఇవ్వాలని భావిస్తున్నామన్నారు. ఈ 10 రోజుల కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ శాఖలైన సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్), పంచాయత్ రాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ద్వారా స్పాన్సర్ చేయబడిందని తెలిపారు. ఈ కార్యక్రమం మహిళలకు పెద్దమొత్తంలో వంట చేయడంలో జీవనోపాధి శిక్షణనిస్తుందని, వారి స్వంత క్యాంటీన్‌లను తెరవడానికి, విజయవంతమైన వ్యాపారవేత్తలుగా మారడానికి వారికి సహాయం చేస్తుందని ప్రోత్సహిస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నిర్వాహకులను సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మిచెల్ జె ఫ్రాన్సిస్, జెండగే హనుమంత్ కొండిబా తదితరులు అభినందించారు.



## ప్రభుత్వ పాఠశాలలో సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**కొంపల్లి జెడ్పిహెచ్ఎస్ సందర్శించిన ఎమ్మెల్యే కెపి వివేకానంద్**

**కుత్బుల్లాపూర్, సిటీటైమ్స్:** గత పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అనేక ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి పరిచామని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలో సమస్యలను పట్టించుకునే వారే లేకుండా పోయారని ఎమ్మెల్యే కెపి వివేకానంద్ అన్నారు. సోమవారం కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కెపి వివేకానంద్ సందర్శించారు. ఈ సంధర్బంగా విద్యార్థులు స్కూల్ లో త్రాగునీటి సౌకర్యం సరిగా లేదని, ప్లే గ్రౌండ్, కిచెన్ ను అభివృద్ధి పరచాలని ఎమ్మెల్యేకి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి వివేకానంద్ మాట్లాడుతూ.. గత పదేళ్ల కాలంలో నియోజకవర్గంలోని ఎన్నో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి పరిచామని, పాఠశాలలో నెలకొని ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రీహరి, మున్సిపల్ ఛైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, వైస్ చైర్మన్ గంగయ్య నాయక్, కౌన్సిలర్లు వినోద్, రవీందర్, సువర్ణ, చింతల దేవేందర్ యాదవ్, నాయకులు ప్రవీణ్ రావు, పాఠశాల హెచ్ఎం కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా కొనసాగుతున్న ముత్యాల ముగ్గుల పోటీలు

**ఫ్రెండ్స్ వెల్ఫేర్, కొమిరిశెట్టి ఫౌండేషన్ల సంయుక్త నిర్వహణ**



**శేరిలింగంపల్లి,సిటీటైమ్స్:** మన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలే పండుగలని కొమిరిశెట్టి ఫౌండేషన్ అధ్యక్షులు కొమిరిశెట్టి సాయిబాబా, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవులు తెలిపారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కొమిరిశెట్టి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలో గల 35 కాలనీలలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి కాలనీలో పోటీలలో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ 5ప్రోత్సాహక బహుమతులు అందజేయడం జరుగుతుంది. దీనిలో భాగంగా సోమవారం మాదాపూర్ డివిజన్ పరిధిలో గల చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ లో స్వయం ఉపాధి శిక్షణ పొందుతున్న మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతి ప్రదానం చేసిన అనంతరం కొమిరిశెట్టి ఫౌండేషన్ అధ్యక్షులు కొమిరిశెట్టి సాయిబాబా ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవులు మాట్లాడుతూ ..పరిశుభ్రత, ఆరోగ్యం, అలంకరణల మేళవింపే ముగ్గులు అని అన్నారు. ఈ పోటీల వలన మహిళలలో ఉన్న సృజనాత్మక శక్తి వెలికి రావడానికి అవకాశం ఉంటుంది. పట్టణీకరణ నేపథ్యంలో అపార్టుమెంట్ల సంస్కృతి పెరిగిన తరువాత భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు నానాటికి కనుమరుగవుతున్నాయి. నేటి యువతరం మన ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలు కొనసాగించేందుకై ఈ పోటీలు నిర్వహిస్తున్నాం అని అన్నారు. ఈ ముగ్గుల వలన పరిసరాలు పరిశుభ్రతగా ఉంటాయి. గోమయంతో కళ్ళాపి జల్లి బియ్యపు పిండితో ముగ్గులు వేయడం వలన బియ్యపు పిండి తినడానికి చీమలు చేరతాయి. ఆ విధంగా చీమలు క్రిమి కీటకాదులు ఇంటి లోనికి రాకుండా అడ్డుకుంటాయి. ఈ ముగ్గులు వేసే ప్రక్రియలో మహిళలు అనేక శరీర భంగిమలలో పనిచేయవలసి ఉటుంది. ఈ వ్యాయామ ప్రక్రియ వలన మహిళలలో అనేక గర్భకోశ వ్యాధులు రాకుండా ఉండేందుకు అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. కావున ప్రతి మహిళ కూడా ప్రత్యేకించి ఈ ధనుర్మాసం మొత్తం నెలరోజులు అత్యంత ఉత్సాహంగా వేకువ ఝామున లేచి ముగ్గులు వేయడం ప్రారంభిస్తారు అని అన్నారు. పోటీలలో విజేతల ఎంపికలో తాటిచర్ల వరలక్ష్మి, అనూషా జడ్జీలుగా వ్యవహరించారు. ఈ పోటీలలో 50మంది మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్ (చంద్ర రాజేశ్వరరావు) ఫౌండేషన్ డైరెక్టర్ (మహిళా విభాగం) జ్యోస్యభట్ల కల్పన, ట్రెజరర్ సిఆర్ ఫౌండేషన్ వి చెన్నకేశవ రావు , ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు శివ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## సమగ్ర, సంతులిత అభివృద్ధే లక్ష్యం

**ప్రతి డివిజన్లలో మౌళికవసతుల కల్పనకు కృషి**
**-పిఎసి చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ**

**శేరిలింగంపల్లి, సిటీటైమ్స్:** శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సమగ్ర, సంతులిత అభివృద్ధిలో భాగంగా ప్రతి డివిజన్లలో మౌళిక వసతుల కల్పన కొరకై ప్రతి డివిజన్ లో అవసరమైన మంచి నీటి పైప్ లైన్ నిర్మాణం, యుజిడి పైప్ లైన్ నిర్మాణ పనులకు ప్రతిపాదనలు తీసుకోవడం జరిగిందని పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ తెలిపారు. సోమవారం హఫీజ్ పేట్ లోని జలమండలి కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో మంచి నీటి సరఫరా యుజిడి నిర్వహణపై జలమండలి అధికారులు, కార్పొరేటర్లు మంజుల రఘునాథ్ రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్, జలమండలి అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పలు కాలనీ వాసుల నుండి వచ్చిన వినతి పత్రాలను పరిగణలోకి తీసుకొని అత్యవసర పనుల పై తక్షణమే స్పందించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, ప్రతి ఫిర్యాదు పై స్పందించాలని, ప్రజలకు జవాబుదారీతనంగా ఉండలని , ప్రజల నుండి వచ్చే ప్రతి అర్జీ పరిష్కారానికి కృషి చేయాలని, ప్రజలకు ఎల్లవేళలో అందుబాటులో ఉండాలని అధికారులకు తెలిపారు. ప్రజలకు సురక్షితమైన మంచి నీళ్లు అందించడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ,ప్రజలకు మెరుగైన మంచి నీటి సరఫరా అందించాలని , ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గాంధీ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు జిఎం నారాయణ, డిజిఎం వెంకటేశ్వర్లు,డిజిఎం శరత్ రెడ్డి, డిజిఎం నరేందర్ రెడ్డి, మేనేజర్లు సుబ్రమణ్యం, యాదయ్య, సందీప్ రెడ్డి, అభిషేక్ రెడ్డి, విక్రమ్ రెడ్డి, సునీత, రఘునాథ్ రెడ్డి, బాలింగ్ గౌతమ్ గౌడ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



## డాడీరోడ్ క్యూఆర్ డెక్కల్ ను ప్రారంభించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ

**సిటీటైమ్స్, దుండిగల్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి గండి మైసమ్మలోని నూతనంగా ఏర్పాటు చేసిన డాడీరోడ్ క్యూఆర్ డెక్కల్ ను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం క్రిష్ణ మాట్లాడుతూ ప్రజలు వారి వాహనాలకు సేఫ్టీ కొరకు క్యూఆర్ కోడ్ ను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సాయి యాదవ్, ఆనంద్ కుమార్, పాక్స్ డైరెక్టర్ జీతయ్య, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీతేజ్ ను పరామర్శించిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

**హైదరాబాద్, డిసెంబర్ 23, సిటీ టైమ్స్:** సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాటలో గాయపడి కిమ్స్‌లో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సోమవారం పరామర్శించారు. శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీతేజ్ కళ్ళు తెరిచి చూస్తున్నాడని, కానీ ఇప్పటికీ ఎవరిని గుర్తుపట్టలేకపోతున్నాడని వైద్యులు మేయర్ కు తెలిపారు. మెరుగైన వైద్యం అందించి శ్రీతేజ్ త్వరగా కోలుకునే విధంగా చికిత్స అందించాలని ఆమె వైద్యులను కోరారు శ్రీతేజ్ పూర్తిగా ఆరోగ్యవంతుడిగా మారాలని ఆమె ఆకాంక్షించారు.

## పుష్ప 2 సినిమాపై మేడిపల్లి పోలీస్ స్టేషన్లో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఫిర్యాదు

**-పోలీసులను కించపరిచే విధంగా ఆఫీసర్ స్విమ్మింగ్ పూల్ లో ఉండగా స్విమ్మింగ్ పూల్ లో ఉచ్చ పోయడంపై విమర్శ**
**- డైరెక్టర్ సుకుమార్ హీరో అల్లు అర్జున్ ప్రొడ్యూసర్లపై చర్యలు తీసుకోవాలి**
**- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న**



**హైదరాబాద్, డిసెంబర్ 23,సిటీ టైమ్స్:** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మేడిపల్లి పోలీస్ స్టేషన్లో ఎస్హెచ్ఓ గోవింద్ రెడ్డికి పుష్ప టు సినిమా పైన ఫిర్యాదు చేసిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ థియేటర్కు వెళ్లి మరి సినిమా చూశాను సినిమాలో కొన్ని సన్నివేశాలు దారుణంగా ఉన్నాయి పోలీసుల పట్ల చిన్నచూపు చూసే విధంగా గంధపు చెక్కల స్మగ్లర్ పెద్ద హీరోగా స్మగ్లర్ వచ్చి పోలీస్ ఆఫీసర్ కారును ఢీ కొట్టి పోలీస్ ఆఫీసర్ స్విమ్మింగ్ పూల్ లో పడిపోయిన తర్వాత ఏకంగా స్విమ్మింగ్ పూల్ లోనే పుష్ప టు సినిమా హీరో అల్లు అర్జున్ ఉచ్చ పోయడం పోలీసులను చాలా అవమానించడమే దీనిపైన డైరెక్టర్ సుకుమార్ ప్రొడ్యూసర్ మరియు సినిమా హీరో అల్లు అర్జున్ పైన చర్యలు తీసుకోవాలి చట్టరీత్యా ఆ సీన్ కట్ చేయాలి మరి ఎటువంటి సీన్లకు ఇటువంటి సినిమాలకు సెన్సార్ బోర్డు ఎందుకో అనుమతిస్తుంది మరి సెన్సార్ బోర్డులో ఏం జరుగుతుంది ఏం మెసేజ్ ఇస్తున్నారు తెలంగాణ ప్రజలకు మరియు భారతదేశ ప్రజలకు స్మగ్లర్లే హీరోలాగా చూపిస్తే నేటి యువత అదే మార్గంలో చెడు మార్గంలో వెళ్తే ఇది సమాజాన్ని నాశనం చేయడం కాదా. ఇటువంటి సినిమాలను ప్రోత్సహించకుండా మంచి సినిమాలను ప్రోత్సహించి పదిమందికి ఉపయోగపడే సినిమాలను మనం ఎంకరేజ్ చేయాల్సిన అవసరం ఉంటది ఇటువంటి సినిమాలు తీసిన దర్శక నిర్మాతలు యాక్టింగ్ చేసిన హీరోల పైన చర్యలు తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేస్తున్నా అని తీన్మార్ మల్లన్న తెలియజేశారు.



# దేశం పాడిన గాయకుడు

కిశోర్ కుమార్ మీద సంజయ్ గాంధీ కినుక వహించాడు. 'ఇరవై సూత్రాల పథకం' ప్రచారం కోసం దూరదర్శన్ లో మొదలెట్టిన 'గీతోం భరీ షామ్'లో పాడమని కిశోర్‌ని సంజయ్ గాంధీ ఆదేశించాడు. డబ్బులు లేకుండా కిశోర్ పాడడు. ఆదేశిస్తే అసలు పాడడు. దాంతో కిశోర్ గొంతుకు రేడియోలో తాళం పడింది. సినిమాల్లో పాడిస్తే ఏం గొడవోనని నిర్మాతలు వెనక్కి తగ్గారు. 'ఆరాధన' సూపర్ హిట్ తర్వాత కిశోర్‌కు వచ్చిన తిప్పలు ఇవి. అప్పుడు కొంతమంది రఫీ దగ్గరకు వచ్చి 'కిశోర్‌కు శాస్తి జరిగింది. ఈ కాలాన్ని ఉపయోగించుకోండి' అన్నారు. రఫీ ఏం మాట్లాడలేదు. ఢిల్లీ వెళ్లి సంజయ్‌ను కలిశాడు. 'మీరు కిశోర్ మీద బ్యాన్ ఎత్తేయండి. అందుకు బదులుగా ఒకటి కాదు పది ప్రోగ్రామ్‌లు చేసిస్తాను' అన్నాడు. ఆ వెంటనే నౌషాద్‌ను వెంటబెట్టుకుని దూరదర్శన్‌లో ప్రోగ్రామ్ ఇచ్చాడు. కిశోర్ బ్యాన్ పోయింది. పత్రికలు కూడా కిలాడీవి. రాజేష్ ఖన్నా స్టార్‌డమ్‌తో కిశోర్ గొంతు గిరాకీలోకి రాగానే 'రఫీ పని అయిపోయింది' అని రాయడం మొదలెట్టారు. రికార్డింగులు లేక రఫీ గోళ్లు గిల్లుకుంటున్నాడని రాశారు. కిశోర్ తైనాతీలు ఇవన్నీ తెచ్చి కిశోర్‌కి చూపించారు. కిశోర్ సంతోషించాడా? ప్రెస్‌మీట్ పెట్టి 'ఇలాంటి వెధవ రాతలు మానండి. ఆయనంటే నాకు చాలా గౌరవం. మీరు ఎవర్ని గెలిపించి ఎవర్ని ఓడిస్తారు?' అన్నాడు. ఈ ఇద్దరిని కొంతమంది ఫలానా మతం అనుకుంటారు. ఈ ఇద్దరు మాత్రం ఈ దేశవాసులు. రామ్, రహీమ్‌ల సన్మతి ఎరిగినవారు. రంజాను మాసంలో రికార్డింగుకు వచ్చి 'హుక్కే మే ధువా' (హుక్కా పొగ) అనే పదం చూసి పాడనన్నాడు రఫీ ఉపవాసానికి భంగమని. మతం అంటే అంత నిష్ఠ. సాటి మతం పట్ల? అంతే నిష్ఠ. 'మన్ తర్‌పత్ హరి దర్శన్ కో ఆజ్'.... 'బైజూ బావరా'లో రఫీ పాడితే కన్నీరు ఆగదు వినేవారికి.

ఆ కాలంలో అనేక ఆలయాల్లో ఇది ప్రభాతగీతం. దీనిని పాడింది, రాసింది, స్వరం కట్టింది... రఫీ, షకీల్ బదాయునీ, నౌషాద్. 'నా గొంతు రొటీన్ అవుతోంది. నాకు భజనలు పాడాలని ఉంది' అని రఫీ వస్తే ఖయ్యాం ఆ కోరిక మన్నించి భజనలు పాడించి అపురూపమైన రికార్డు విడుదల చేశాడు. 'రఫీ గొంతులో దేవుడు ఉన్నాడు' అని అందరూ అనేవారే. ఆ దేవుడు అల్లాయా, ఈశ్వరుడా వెతకడం అల్పుల పని.

1950–70ల మధ్య మన దేశ సినీ సంగీతం దాదాపు అన్ని భాషల్లో స్వర్ణయుగం చూసింది. సినిమా – దేశవాసులను కలిపే కొత్త మతం అయ్యింది. కళాకారులు వినోద ఉల్లాసాలకే కాదు సామ రస్య, సౌభ్రాతృత్వాలకు ప్రవక్తలుగా మారారు. దేశ విభజన చేదు నుంచి జనాన్ని బయట పడేయడానికి గుర్తెరిగి బాధ్యతగా నడుచుకున్నవారే అందరూ! 'తూ హిందు బనేగా నా ముసల్మాన్ బనేగా ఇన్‌సాన్ కీ ఔలాద్ హై ఔలాద్ బనేగా'... (నువ్వు హిందువువి కావద్దు, ముసల్మానువి కావద్దు, మనిషిగా పుట్టినందున మనిషిగా మిగులు) అని సాహిర్ రాయగా రఫీ పాడి చిరస్మరణీయం చేశాడు.

మదన్ మోహన్ ట్యూన్ చేసిన 'కర్‌చలే హమ్ ఫిదా'... రఫీ పాడితే నేటికీ సరిహద్దు సైనికులకు తేజోగీతమే. గాంధీజీని బలిగొన్నారన్న వార్త తెలియగానే సంగీత దర్శకులు హన్స్‌లాల్–భగత్‌రామ్, గీతకర్త రాజేంద్ర కిషన్ కలిసి ఆయనకు నివాళిగా 'సునో సునో అయ్ దునియావాలో బాపు కీ ఏ అమర్ కహానీ' రూపొందిస్తే ఇంకెవరు పాడతారు రఫీ తప్ప! బాపు పాదాల ఎదుట పారిజాతాల కుప్ప గదా ఈ పాట. సరళత్వము, తీయదనము, స్వచ్ఛత... వీటిని ప్రదర్శించడం ద్వారా ముప్పై ఏళ్ల పాటు పాడి కోట్ల మంది అభిమానులను పొందిన అమృత గాయకుడు రఫీ. 'సుహానీ రాత్ ఢల్ చుకీ, 'చౌద్‌వీ కా చాంద్ హో', 'బహారో ఫూల్ బర్సావో', 'ఓ దునియా కే రఖ్‌వాలే', 'ఖోయా ఖోయా చాంద్', 'దీవానా హువా బాదల్', 'క్యా హువా తేరా వాదా'... ఈ పాటలకు అంతూ పొంతూ ఉందా? కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు... ఏ ప్రాంతమో ఏ భాషో... అందరూ రఫీ అభిమానులు. రోజువారీ పనిలో, కాయకష్టంలో, సేద తీరే వేళ, వేడుకల్లో రఫీ.. రఫీ... రఫీ! కూతురిని అత్తారింటికి సాగనంపేటప్పుడు ప్రతి తండ్రి తలుచుకుని ఉద్వేగాశ్రువులు రాల్చే పాట 'బాబుల్ కి దువాయే లేతీ జా'... షంషాద్ బేగం, గీతాదత్, లతా, ఆశా... అందరూ రఫీకి జోడీలే. దిలీప్ కుమార్, దేవ్ ఆనంద్, షమ్మీ కపూర్, అమితాబ్... అందరూ అభినయకర్తలే. రఫీ పాడటంతో సగం నటన. మిగిలిన సగమే వీరు చేయాల్సి వచ్చేది.

55 ఏళ్లకు మరణించాడు రఫీ. రేపటి డిసెంబర్ 24కు శత జయంతి. అయినా ఇన్నాళ్లకూ కాసింత కూడా మరపునకురాని సుర గాయకుడు. పాటనూ, ప్రేమనూ పంచి అందరి చేత 'రఫీ సాబ్' అనిపించుకున్నవాడు. ఆయన మృతదేహం ఆస్పత్రిలో ఉంటే 'భూపిందర్ సింగ్ – రఫీ తమ్ముడు' అని సంతకం పెట్టి ఇంటికి చేర్చిన గాయకుడు భూపిందర్‌ది ఏ మతం? చనిపోయిన అన్న రఫీది ఏ మతం? ఆ రోజు ఆకాశం నుంచి ఆగని వర్షం.

ఇసుక వేస్తే రాలని జనం. గాంధీ గారు మరణించినప్పుడు ఇంత జనం వచ్చారట. రఫీ శత జయంతి ముగియనున్న ఈ వేళ అందరం వెలికి తీయవలసింది, జాగృత పరచవలసినది ఆయన పంచిన ఈ ప్రేమనే, ప్రేమమయ గీతాలనే! విద్వేష గీతాన్ని ఎవరు ఆలపించాలనుకున్నా కావలించుకుని వినిపిద్దాం రఫీ గీతం – జిందాబాద్ జిందాబాద్ అయ్ మొహబ్బత్ జిందాబాద్. జీతే రహో రఫీ సాబ్! అభీనా జావో ఛోడ్‌కర్ కె దిల్ అభీ భరా నహీ...

# ఒక దేశం ఒక ఎన్నికపై... ఒక మాట!

'భిన్నత్వంలో ఏకత్వం' భారత లక్షణమే కాదు, విలక్షణ సంపద అని పలుమార్లు రుజువైంది. ఉద్వేగ నినాదంగా బాగున్నంత, 'ఒక దేశం ఒక ఎన్నిక' ఆచరణ గొప్పగా ఉంటుందనే నమ్మకం లేదు. ఇందులో పలు సమస్యలున్నాయి. దేశంలో రావాల్సిన ఎన్నికల సంస్కరణల్లో ఇదంత ప్రాధాన్యతాంశమేమీ కాదు! అంతకన్నా ప్రాధాన్య అంశాలెన్నిటికో దిక్కూదివాణం లేక ప్రజాస్వామ్యమే వెనుకడుగులోకి జారుతోంది. ముందు ఆ సంస్కరణలు ముఖ్యం. జమిలితో... అభివృద్ధికి ఉండే ఆటంకాలు తొలగిపోతాయి. సమయం, ఆర్థికమానవ వనరుల దుబారా తగ్గుతుందనేది ఓ ఆశ! కానీ,ప్రాంతీయ అస్తిత్వాలకు అదొక గొడ్డలిపెట్టు. సమాఖ్య స్ఫూర్తికి భంగకరం.



కేంద్ర ప్రభుత్వం ఆశిస్తున్నట్టుగానే... దేశ మంతటా ఒకేసారి (జమిలి) ఎన్నికలు జరిపించే విషయంలో సమగ్ర చర్చ జరగాలి. శాసనసభల స్పీకర్లతో పాటు మేధావులు, సమాజంలోని విభిన్నవర్గాల ప్రతినిధుల్ని భాగం చేసి చర్చించాలి. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని కమిటీ సంప్రదింపుల్లో 32 పార్టీలు సానుకూలంగా మాట్లాడి, మద్దతు ప్రకటిస్తే 15 పార్టీలు పూర్తిగా వ్యతిరేకించాయి. వ్యతిరేకిస్తున్న పార్టీల్లో కాంగ్రెస్ ఉండటంతో... 1952 నుంచి 1967 వరకు, వరుస నాలుగు ఎన్నికల్లో కేంద్రం రాష్ట్రాల ఎన్నికల్ని కలిపి (జమిలి) నిర్వహించి నపుడు, మరిప్పుడెందుకు సాధ్యపడదు? ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? అనే ప్రశ్న పాలకపక్షాలు లేవనెత్తుతున్నాయి.

స్వాతంత్ర్యం వచ్చాక జరిగిన తొలి సభలు కావడంతో అది సాధ్యమైంది. తర్వాత ఎన్నో మార్పులొచ్చాయి. భాషా ప్రాతిపదికన రాష్ట్రాల విభజన జరిగింది. అవిశ్వాసాల్లో కొన్ని సభలు అర్ధంతరంగా ముగిశాయి. కొన్ని ప్రభుత్వాలు కూలిపోయో, రాష్ట్రపతి పాలన విధింపుతోనో ఎన్నికల ద్వారా కొత్త సభలు ఏర్పడ్డాయి. ఇలా వేర్వేరు పరిణామాల వల్ల లోక్‌సభకు, వివిధ శాసనసభలకు ఎన్నికల గడువు కాలాలు మారుతూ వచ్చాయి. భారత ఎన్నికల సంఘానికున్న విచక్షణాధికార పరిధి, వెసులుబాటు వల్ల... అప్పటికి రద్దయిన, రాష్ట్రపతి పాలనలో ఉన్న రాష్ట్రాల సభల ఎన్నికల కాలాలు స్వల్పంగా అటిటు అవుతూ వచ్చాయి. అందుకే, 1970ల తర్వాత జమిలి సాధ్య పడలేదు. 'జమిలి కొత్తేం కాదు, ఇదివరకు జరిగిందే' అని అమిత్ షా అంటున్నా, ఇవాళ్టి పరిస్థితి వేరు. అదంత సాధారణమే అయితే, ఇపుడు చట్టాలనూ, రాజ్యాంగాన్నీ మార్చడమెందుకు?

**ఎలా సమానం చేస్తారు?**

అన్ని ఎన్నికల్ని ఒక తేదీకి లాగే క్రమంలో... ఎన్నో మార్పులు చేయాల్సి ఉంటుంది. మొదట, పొట్టికాలం నిడివి సభలు, పొడుగు కాలం నిడివి సభలు అనివార్యమవుతాయి. బలవంతపు రాష్ట్రపతి పాలనలూ ఉంటాయేమో? ఇప్పుడు ప్రతిపాదిస్తున్నట్టు 2027లోనో, మరెపుడో జమిలి ఎన్నికల్ని నిర్వహించాక కూడా... ఏ కారణం చేతైనా ఒక రాష్ట్ర అసెంబ్లీ రద్దయితే, తిరిగి ఎన్నికల ద్వారా ఏర్పడే కొత్త సభను ఆ మిగిలిపోయిన కాలానికే పరిమితం చేస్తారు. సభ రద్దయిన సమయాన్ని (నాలుగేళ్లకో, మూడేళ్లకో రద్దయింది అనుకుంటే) బట్టి కొత్త సభకు ఏడాదో, రెండేళ్లో మిగలవచ్చు.

సాధారణ ఎన్నికల్లో జరిగినట్టే అన్ని నియోజకవర్గాల, అందరు ఓటర్ల నిర్ణయంతో జరిగే మధ్యంతర ఎన్నికలో గెలిచిన సభ్యుల కొత్తసభ అలా ఆరు మాసాలకో, ఏడాదికో పరిమితం కావాల్సి రావడం ఏ రాజ్యాంగ ప్రజాస్వామ్య స్ఫూర్తికి ప్రతీక? అది డబ్బు, మానవ వనరుల దుబారా కాదా? అనే ప్రశ్న సహజం. దీనికి రాజకీయ పార్టీలు ఎలా అంగీ కరిస్తాయో చూడాలి. చాలా దేశాల్లో దేశవ్యాప్త ఎన్నికలు, ప్రాదేశిక ఎన్నికలు వేటికవిగానే జరుగుతాయి.

జమిలి జరిపే ఏడెనిమిది దేశాల్లో అధ్యక్ష తరహా పాలనకిది సానుకూలమే! జమిలి ఎన్నికల నిర్వహణా ఒక సంక్లిష్టమే! మొన్నటి హరియాణా ఎన్నికలతో, గడువు సమీపించిన మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల్ని ఎందుకు కలపటం లేదని అడిగితే, '... శాంతి భద్రతలు, నిర్వహణ పరంగా ఇబ్బందులుంటా య'ని ఎన్నికల సంఘం పేర్కొంది. నాలుగైదు రాష్ట్రాల్లోనే ఒకేసారి ఎన్నికలు నిర్వహించలేని వారు మొత్తం దేశవ్యాప్తంగా లోక్‌సభకు దాదాపు 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్ని కలిపి, రేపెప్పుడో స్థానిక సంస్థల ఎన్నికల్నీ కలిపి 'మహా జమిలి' ఎలా నిర్వహిస్తారు? అనే ప్రశ్న సహజం.

**సంస్కరణల సవాళ్లెన్నో...**

భారీ ఓటర్ల భాగస్వామ్యంతో భారత ఎన్నికల నిర్వహణ ప్రపంచంలోనే ఒక అబ్బురం! బ్యాలెట్ నుంచి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రా (ఈవీఎం) లకు మారిన తర్వాత కూడా, అభివృద్ధి చెందిన దేశాలు విస్మయం చెందే స్థాయిలో మన 'మహా ఎన్నికలు' జరుగుతున్నాయి. విడతలుగా జరిగిన ఎన్నికల సంస్కరణలు ప్రక్రియను చాలా వరకు పారదర్శకం చేశాయి. స్వేచ్ఛగా స్వతంత్రంగా ఓటర్లు తమ నిర్ణ యాన్ని ప్రకటిస్తున్నప్పటికీ... ఎన్నికల్లో ధన ప్రవాహం, ప్రక్రియలో లోపిస్తున్న జవాబుదారీతనం ఆందోళన కలిగిస్తున్నాయి.

'దేశ ఎన్ని కల ప్రక్రియలో ముదురుతున్న 'క్యాష్ క్యాన్సర్'ను నియంత్రించే సంస్కరణ అత్యవసరంగా రావాలి' అని సీనియర్ జర్నలిస్టు రాజ్‌దీప్ సర్దేశాయి ఇటీవల హైదరాబాద్‌లో చేసిన వ్యాఖ్య కీలకమైంది. 'మునుగోడు' అసెంబ్లీ ఉప ఎన్నికలో మనం కళ్లారా చూశాం. సరిగ్గా పోలింగ్‌కు ముందు లక్షల ఓట్లు గల్లంతయినా, నిన్న మహారాష్ట్రలో జరిగినట్టు ఒకటి, రెండు నెలల్లోనే లక్షలాది కొత్త ఓట్లు నమోదైనా... ఎన్నికల సంఘం నుంచి సరైన వివరణ, జవాబుదారీతనం లేక పోవడం దారుణం.

ఈ సంస్కరణలు చేపట్టకుండా 'జమిలి'కి పట్టుబట్టడం సరికాదనే అభిప్రాయం కొన్ని పార్టీల వారు, మేధావులు వ్యక్తంచేస్తున్నారు. విడిగా ప్రజాప్రతినిధులు గానీ, స్థూలంగా పార్టీలు గానీ, ప్రభుత్వాలు గానీ ఆశించిన/నిర్దేశించిన స్థాయిలో పనిచేయకుంటే వారిని వెనక్కి రప్పించే (కాల్ బ్యాక్) పద్ధతి ఉండాలనే డిమాండ్ పెరుగుతున్న తరుణంలో... అయిదేళ్ల కొకమారు అన్ని ఎన్నికలూ జరిపేయాలి, మధ్యలో ఏ ఎన్నికలూ ఉండొద్దనే నిర్బంధ మేమిటనే వాదన ఒకటుంది.

మధ్యలో వేర్వేరు ఎన్నికలుంటేనే నాయకులైనా, పార్టీలైనా, ప్రభుత్వాలైనా కొద్దో గొప్పో భయంతో ఉంటాయనేది సాధారణ అభిప్రాయం. అందుకు, ఎన్నో సాక్ష్యాలు, తార్కాణాలు మన కళ్లముందే ఉన్నాయి. కాన్షీరామ్ అన్నట్టు 'ఏటా ఎన్నికలుండాలి' అనే వాదనను బలపరచకపోయినా... ఎన్నికల భయం ఉన్నపుడే ప్రభుత్వాలు ప్రజానుకూలంగా నడుచుకోవడం తరచూ జరిగేదే!

అలా కాకుండా, ఒకసారి 'జమిలి' జరిగితే, ఇక అయిదేళ్లూ ఏ ఎన్నికలుండవంటే... ప్రభుత్వాల ఏకస్వామ్యమే సాగుతుందనే భయాలున్నాయి. పైగా, భిన్నత్వ ప్రతీక అయిన దేశంలోని ప్రాంతీయ అస్తిత్వాలు, భావనలు, వాదనలు... 'జమిలి'లో ఆధిపత్యం వహించే జాతీయ ప్రవాహంలో కొట్టుకుపోతాయనే ఆందోళన కూడా ఉంది. అందుకే, పలు ప్రాంతీయ పార్టీలు దీన్ని వ్యతిరేకిస్తున్నాయి.

**ఒక పార్టీ ఒక నాయకుడు అంటారేమో!**

ఉభయ సభల్లో ఎన్డీయేకున్నది బొటాబొటీ మెజారిటీ! మూడింట రెండొంతుల మెజారిటీ ఉంటే తప్ప సాధ్యపడని రాజ్యాంగ సవ రణలకు ఎలా సాహసిస్తున్నారనేది ప్రశ్న! రాజ్యసభలో 164/243 అవసరమైనచోట 122 (42 తక్కువ) సంఖ్యాబలమే ఉంది. లోక్ సభలో 361/542 (ఒక ఖాళీ) అవసరం కాగా ఉన్నది 293 (63 కొరత) మాత్రమే! ఆ రోజు సభకు హాజరైన వారిలో మూడింట రెండొంతులు చాలు కనుక... ప్రత్యర్థి పార్టీల నుంచి క్రాస్ ఓటింగ్, గైర్హాజరీలను ప్రోత్సహిస్తారా? అని విపక్షంలో భయ సందేహాలున్నాయి. తరచూ ఎన్నికల వల్ల కోడ్ అమలు అభివృద్ధికి ఆటంకమనే భావనే తప్పని, ఓట్ల యావతో ఎన్నికలకు నెలల ముందే అభివృద్ధి పనులు చేయడం కాకుండా అయిదేళ్లపాటు జరిపితే కోడ్‌కు వెరవా ల్సిన భయమేమిటని ప్రశ్నిస్తున్నారు. 'జమిలి'పై ఎందుకీ పంతం?' ఇదే పంథాలో సాగి, రేపు 'ఒక పార్టీ, ఒకే నాయకుడ'నే నినాదంతో ప్రజాస్వామ్యాన్ని అధ్యక్ష తరహా పాలనవైపు నడిపే ప్రమాదాన్ని మొగ్గలోనే తుంచేయాలన్నది వ్యతిరేకవాదన వినిపించే వారి మాట!

# తిరుగు వలసలు చెబుతున్నదేమిటి?



కోవిడ్ మహమ్మారి కాలంలో లక్షలాది మంది నగరాల నుంచి తమ గ్రామాలకు తిరిగి వెళ్లారు. మహమ్మారి ముగిసిన తర్వాత వీరందరూ తిరిగి నగరా లకు చేరుకుంటారన్న అంచనాలకు భిన్నంగా గ్రామాల్లోనే ఉండిపోయారు. 2020–22 మధ్య కాలంలో గ్రామీణ శ్రామిక శక్తికి సుమారు 5 కోట్ల 60 లక్షల మంది కార్మికులు జోడించబడ్డారు. వీళ్లలో ఎక్కువమంది యువత. పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ లాంటివాటిని మినహాయిస్తే, చాలా రాష్ట్రాల్లో వ్యవసాయ కుటుంబాల సంఖ్య పెరిగింది. ఇవన్నీ కూడా జీవనోపాధికి చెందిన సవాళ్లను ఎదుర్కోవటంలో వ్యవసాయానికి ఉన్న ప్రాముఖ్యాన్ని చాటుతున్నాయి. వ్యవసాయం మీద ఆధారపడేవారి సంఖ్యను తగ్గించే ఆర్థిక విధానాలకు బదులుగా, వ్యవసాయాన్ని స్థిరమైన, లాభదాయకమైన వ్యవస్థగా మార్చాలి.

భారత ప్రజలు ప్రస్తుతం పెద్ద సంఖ్యలో తమ గ్రామాలకు తిరిగి వెళ్తున్నారు. గత ఐదేళ్లలో, పట్టణ కేంద్రాల్లో మెరుగైన ఉపాధి అవకాశాల కోసం, 'తక్కువ-ఉత్పాదకత' కలిగిన వ్యవసాయం నుండి కార్మికులను బయటకు నెట్టడానికి సంకల్పించిన విధానం ఇప్పుడు అడ్డం తిరిగింది.

కోవిడ్-19 మహమ్మారి కాలంలో మొదటిసారి తిరుగు వలసలు (రివర్స్ మైగ్రేషన్) మొదలయ్యాయి. లక్షలాది మంది పట్టణ పేదలు అనంత దూరాలు, చాలామంది కాలినడకన తమ తమ ఊళ్లకు ప్రయాణించారు. దేశ విభజన రోజుల తర్వాత ఇది ప్రజల అతిపెద్ద చలనం. కనీవినీ ఎరుగనంత స్థాయిలో సాగిన ఈ అంతర్-రాష్ట్ర వలసలు, రాష్ట్రం లోపలి వలసలు తాత్కాలికమని నమ్మారు. కానీ, మహమ్మారి ముగిసిన తర్వాత శ్రామికశక్తి నగరాలకు తిరిగి వస్తుందనే అంచనాను తోసిపుచ్చుతూ, వాళ్లలో ఎక్కువ మంది తమ ఊళ్లలోనే ఉండడానికి ఇష్టపడటం జరిగింది.

**వ్యవసాయంలోనే ఉపాధి**

'నేషనల్ శాంపిల్ సర్వే', 'పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే'ల డేటా ఆధారంగా, 'ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్', న్యూఢిల్లీకి చెందిన 'ఇన్ స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ డెవలప్‌మెంట్' రూపొందించిన ఒక నివేదికలో వ్యవసాయ ఉపాధి పెరిగిందని తేలింది. సాధారణ అభి ప్రాయానికి విరుద్ధంగా, 2020-2022 మధ్య గ్రామీణ శ్రామికశక్తికి 5 కోట్ల 60 లక్షలమంది కార్మికులు జోడించబడ్డారు. నిరుద్యోగం వృద్ధి చెందుతున్న సమయంలో, నగరాల్లో లభించే ఉపాధి అవకాశాలు వలస కార్మికులకు అంతగా ఆకర్షణీయంగా లేవని ఇది నిరూపిస్తోంది. తయారీ రంగంలో మందగమనం, నిర్మాణ రంగ ఉద్యోగాలు తగ్గుముఖం పట్టడం వల్ల నగరాలకు వలస వచ్చినవారు గ్రామాలకు తిరిగి వెళ్లడమే మంచిదని భావించారు.

ఆసక్తికరమైన విషయమేమిటంటే, 2004-05, 2018-19 మధ్య అంటే 13 సంవత్సరాల కాలంలో 6 కోట్ల 60 లక్షల మంది వ్యవసాయ శ్రామికులు పట్టణాలలో చిన్న ఉద్యోగాల కోసం వలస వెళ్లారు. కానీ 2018-19, 2023-24 మధ్య ఐదేళ్లలో 6 కోట్ల 80 లక్షల మంది పైగా ప్రజలు గ్రామాలకు తిరిగి వచ్చారని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వ విద్యా లయానికి చెందిన ఆర్థికవేత్త హిమాన్షు అంచనా వేశారు. వ్యవసాయం అకస్మాత్తుగా లాభదాయకంగా మారిందని దీని అర్థం కాదు. ప్రజలను పొలాల నుండి బయటకు నెట్టడం ఆచరణీయమైన వ్యూహం కాదని ఇది స్పష్టంగా చెబుతోంది.

గ్రామీణ శ్రామిక శక్తిలో వ్యవసాయం వాటా 2018-19లో 42.5 శాతం నుండి 2023-24లో 46.1 శాతానికి పెరిగిందని పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నివేదిక చెబుతోంది. పైగా ఇందులో గణనీయమైన యువ జనాభా కూడా ఉంది. ఇది విస్మరించలేని సందేశాన్ని ఇస్తోంది. ప్రజలను ఆ రంగం నుండి బయటకు నెట్టాలనే లక్ష్యంతో సంవత్సరాలుగా వ్యవసాయాన్ని ఉద్దేశపూర్వకంగా వెనుకపట్టున ఉంచిన విధానాల మీద మన ఆర్థిక ఆలోచనలు నడుస్తున్నాయి. కానీ ఢిల్లీ సరిహద్దుల్లో ఒక సంవత్సరం పాటు జరిగిన ఆందోళనల తరువాత రైతుల నిరసనలు వెల్లువెత్తాయి. తమకు సరైన ఆదాయాన్ని నిరంతరం తిరస్కరించడంపై రైతాంగం ఆగ్రహంతో ఉంది.

**ప్రపంచ బ్యాంకుకు దూరంగా– గాంధీజీకి దగ్గరగా!**

భారతదేశం తన వ్యవసాయరంగం నుండి 40 కోట్ల మంది ప్రజలను నగరాలకు వలసబాట పట్టించాలని ప్రపంచ బ్యాంకు 1996లో కోరింది. ఇది బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీల ఉమ్మడి జనాభా కంటే రెండింతలకు సమానం. అయితే పట్టణ కేంద్రాలకు వలస వెళ్లడానికి వీలుగా ఆర్థిక పరిస్థితులను సృష్టించే బదులు, వ్యవ సాయాన్ని ఆచరణీయమైన వాణిజ్యంగా మార్చడం ద్వారా వ్యవ సాయాన్ని పునర్నిర్మించడంపై దృష్టి సారించాలి. మహాత్మా గాంధీ కోరుకున్నది ఇదే. వలస కార్మికులు తిరిగి వచ్చిన రేటు ఆయన అభి ప్రాయం ఎంత సరైనదో చూపిస్తుంది. అందువల్ల, ప్రపంచ బ్యాంకు ఆలోచనను విడనాడి వ్యవసాయాన్ని పునరుజ్జీవింపజేయడం, వ్యవసాయాన్ని స్థిరమైన, ఆచరణీయమైన, లాభదాయకమైన వ్యవస్థగా మార్చడంపై దృష్టి పెట్టాల్సిన సమయం ఇది. మీకు ఇంకా నమ్మకం లేకుంటే, ఇటీవల విడుదల చేసిన 'నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్' (నాబార్డ్)కు చెందిన 'ఆల్ ఇండియా రూరల్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ సర్వే 2021-22' నివేదికను చూడండి. దీని ప్రకారం, వ్యవసాయంలో నిమగ్నమై ఉన్న జనాభా వాటా సంవత్సరాలుగా గణనీయంగా పెరి గింది. 2016-17లోని 48 శాతం నుండి 2023-24లో గరిష్ఠంగా 57 శాతానికి చేరుకుంది. వ్యవసాయ కుటుంబాల సంఖ్యలో పెనుగంతు స్థానికుల తిరిగిరాకను స్పష్టంగా సూచిస్తోంది. వ్యవసాయ కుటుంబాల వాటా 2016-17లో 42 శాతం నుండి 2021-22 నాటికి 36 శాతానికి తగ్గిన పంజాబ్; 70 నుండి 63 శాతానికి తగ్గిన హిమాచల్ ప్రదేశ్, కొంచెం తగ్గుదల చూపిన గుజరాత్, కర్ణాటకలను మినహాయిస్తే... అనేక రాష్ట్రాల్లో వ్యవసాయ కుటుంబాల పెరుగుదల గణనీయంగా ఉంది. వ్యవసాయ కుటుంబాలు గోవాలో 3 నుండి 18 శాతానికి, హరియాణాలో 34 నుండి 58 శాతానికి పెరిగాయి. ఉత్తరా ఖండ్‌లో 41 నుంచి 57 శాతం; తమిళనాడులో 13 నుండి 57 శాతం పెరుగుదల కనబడింది. ఇతర రాష్ట్రాలు కూడా ఈ పెరుగుదల ధోరణినే చూపుతున్నాయి.

కారణాలు ఏమైనప్పటికీ, అంతర్జాతీయ కార్మిక సంస్థ, పీరి యాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే, నాబార్డ్ చేసిన మూడు అధ్యయనాలు కూడా ఉపాధి, జీవనోపాధికి చెందిన సవాళ్లను ఎదుర్కోవటంలో వ్యవసాయానికి ఉన్న ప్రాముఖ్యతను చాటుతున్నాయి. అందుకే గృహ ఆహార భద్రతను నిర్ధారించడంలో వ్యవసాయ రంగం సామర్థ్యాన్ని విస్మరంచకూడదు.

ఆందోళనలో శుభవార్త వ్యవసాయంలో సంఖ్యలను తగ్గించడంపై ఆధారపడిన మును పటి ఆర్థిక విధానాలను రివర్స్ మైగ్రేషన్ తారుమారు చేసినప్పటికీ, వ్యవసాయంలో ఉపాధి పెరుగుదలను ప్రధాన ఆర్థికవేత్తలు 'ఆందో ళన కలిగించే అంశం'గా చూస్తున్నారు. భారతదేశంలో కనిపిస్తున్న ఈ తిరుగు వలసల ధోరణి తక్కువ మధ్య-ఆదాయ వర్గానికి ప్రత్యేకమైనదిగా చూస్తున్నారు. కానీ వ్యవసాయాన్ని పునర్నిర్మించడానికి అవసరమైన ఆర్థిక విధానాలను పునరుజ్జీవింపజేయవలసిన అవస రాన్ని ఇది సూచిస్తుంది. మారుతున్న క్షేత్ర వాస్తవికతను గుర్తించాల్సిన సమయం ఇది.

ప్రభుత్వం తగిన వనరులను కల్పించడానికి సిద్ధంగా ఉంటే, వ్యవసాయంపై ఆధారపడటం దాని సొంత ఆచరణీయ మార్గాలను సృష్టిస్తుంది. వ్యవసాయం కోసం కేటాయించే బడ్జెట్ వ్యయంలో ఏదైనా పెరుగుదలను ప్రతిపాదిస్తే, అది ఆర్థిక లోటుకు అదనపు మొత్తంగా పరిగణించడాన్ని ఆర్థికవేత్తలు ఇకనైనా మానేయాలి.

'ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్' (ఓఈసీడీ) ప్రకారం, వ్యవసాయంలో నిమగ్నమై ఉన్న 54 ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో భారతదేశం మాత్రమే రైతుల నష్టాలను బడ్జెట్ కేటాయింపుల ద్వారా భర్తీ చేయడం లేదు. నేను తరచుగా చెప్పినట్లు, రైతులు దాదాపు 25 సంవత్సరాలుగా ఏటా పంట నష్టపోతున్నారు. రైతులకు 'దేవుడే దిక్కు' అయ్యే ఈ లోపభూయిష్ట ఆర్థిక రూపకల్పన ఇకనైనా అంతం కావాలి. ఒక విధంగా తిరుగు వలసలను శుభవార్తగా చూడాలి. వనరులను అత్యంత అవసరమైన చోట ఉంచడానికి ఇది సరైన సమయం. అది చివరకు 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్'కు దారి తీస్తుంది.

# అల్లు అర్జున్ పై కఠిన చర్యలు తీసుకోండి..

**ఢిల్లీలో జాతీయ బాలల హక్కుల సంరక్షణ కమిషన్ కు రాచాల యుగంధర్ గౌడ్ ఫిర్యాధు...**



**వనపర్తి బ్యూరో సిటీ టైమ్స్ డిసెంబర్ 23:** హీరో అల్లు అర్జున్ నిర్లక్ష్యం మరియు దుష్ప్రవర్తన కారణంగా బాలల హక్కులతో పాటు వారి సంక్షేమం ప్రమాదం లో పడిందని, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జాతీయ బాలల హక్కుల సంరక్షణ కమిషన్ కు బిసి పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.ఈమేరకు సోమవారం న్యూఢిల్లీ జనపథ్ లోని ఎన్ సి పి సి ఆర్ కార్యాలయంలో సభ్య కార్యదర్శిని కలిసి సంధ్య థియేటర్ ఘటనపై ఫిర్యాధు చేశారు. అనంతరం తెలంగాణ భవన్లో మీడియా రాచాల మాట్లాడారు.డిసెంబర్ 4, 2024న హైదరాబాద్‌లోని సంధ్యా థియేటర్‌లో జరిగిన పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా థియేటర్ యాజమాన్యం, చిత్ర యూనిట్ తీవ్ర నిర్లక్ష్యం మరియు హీరో దుష్ప్రవర్తన కారణంగా ఒక మహిళ చనిపోవడంతో పాటు ఆమె 8 ఏళ్ల కుమారుడు మాస్టర్ శ్రీ తేజ్ తీవ్రంగా గాయపడ్డారని అవేదన వ్యక్తం చేశారు. క్రౌడ్ మేనేజ్‌మెంట్ ఆందోళనల కారణంగా అటువంటి సందర్శనలకు వ్యతిరేకంగా పోలీసు ముందస్తు హెచ్చరిక హెచ్చరించినప్పటికీ నటుడు అల్లు అర్జున్ సంధ్య థియేటర్‌ని సందర్శించడంతో అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారన్నారు.థియేటర్ మేనేజ్‌మెంట్ తగిన భద్రతను కల్పించడంలో, ప్రేక్షకుల కదలికలను నియంత్రించడంలో తగిన అత్యవసర వైద్య సహాయాన్ని ఏర్పాటు చేయడంలో విఫలమైందని, ఇది తొక్కిసలాటకు దారి తీసిందన్నారు.మృతురాలు మొగుడంపల్లి రేవతి 8 ఏళ్ల కుమారుడు మాస్టర్ శ్రీ తేజ్ తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని కిమ్స్ కడిల్స్ హాస్పిటల్‌లో మెకానికల్ వెంటిలేషన్‌లో ఉన్నాడని, తీవ్రమైన హైపోక్సియా మరియు మెదడు దెబ్బ తినడంతో అతని మనుగడపై తీవ్రమైన ఆందోళనలను పెంచుతుందన్నారు.ఈ సంఘటన భారత రాజ్యాంగం మరియు బాలల హక్కులపై ఐక్యరాజ్యసమితి కన్వెన్షన్ కింద హామీ ఇవ్వబడిన జీవితం మరియు భద్రత హక్కు,ఆరోగ్య హక్కు మరియు హాని నుండి రక్షణ హక్కుల ఉల్లంఘనకు ఉదాహరణగా నిలిచిందన్నారు.ఆర్టికల్ 21 ప్రకారం నిర్లక్ష్యం వల్ల ఒక వ్యక్తి యొక్క భద్రత మరియు జీవితానికి అపాయం కలిగించిందని కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు.అత్యవసర సంసిద్ధతను నిర్ధారించడంలో థియేటర్ మరియు ఈవెంట్ నిర్వాహకులు విఫలమయ్యారని, రద్దీగా ఉండే లేదా అసురక్షిత ఉన్న అన్ని వాతావరణంలో మరింత హాని కలిగించే పిల్లల సంక్షేమానికి పబ్లిక్ ఈవెంట్‌లు తప్పనిసరిగా ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.ఈవెంట్ నిర్వాహకులు, థియేటర్ మేనేజ్‌మెంట్ మరియు నటుడు అల్లు అర్జున్ ప్రజల భద్రతకు భరోసా ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ఉల్లంఘనలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు.నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు మరియు ప్రజా భద్రతకు హాని కలిగించినందుకు ప్రాసిక్యూషన్‌తో సహా సంఘటనకు బాధ్యులైన అన్ని పార్టీలపై కఠిన చర్యలను సిఫార్సు చేయండని కమిషన్ కు విజ్ఞప్తి చేశారు.మాస్టర్ శ్రీ తేజ్ యొక్క చికిత్స మరియు పునరావాసం కోసం తక్షణ ఆర్థిక మరియు వైద్య సహాయం కోసం ఏర్పాట్లు చేయడంతో పాటు అత్యున్నత స్థాయి సంరక్షణను నిర్ధారించాలని కోరారు.పబ్లిక్ ఈవెంట్‌ల సమయంలో భద్రత ప్రోటోకాల్‌ల గురించి పిల్లలకు మరియు వారి కుటుంబాలకు అవగాహన కల్పించడానికి దేశవ్యాప్త ప్రచారాన్ని ప్రారంభించాలన్నారు.ఈ విషాద సంఘటన బహిరంగ కార్యక్రమాల సమయంలో బాలల హక్కులు మరియు భద్రతను కాపాడేందుకు కఠిన చర్యలు తీసుకోవాల్సిన తక్షణ అవసరాన్ని నొక్కి చెబుతుందని, మాస్టర్ శ్రీ తేజ్ మరియు అతని కుటుంబానికి న్యాయం జరిగేలా మరియు భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉండేలా గౌరవనీయమైన కమిషన్ జోక్యం చేసుకోవాలని అభ్యర్థించారు.ఈ కార్యక్రమంలో బిసి పొలిటికల్ జెఎసి నాయకులు ఆనంతుల రామ్మూర్తి గౌడ్, బడేసాబ్, రాఘవేందర్ గౌడ్, మహేందర్ నాయుడు, గౌతమ్ శంకర్ గౌడ్,దేవర శివ తదితరులు పాల్గొన్నారు



## ద్విచక్ర వాహనం నుండి పడి యువకుడు మృతి



**సిటీ టైమ్స్ మేడ్చల్ :-** మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధి రాయిలాపూర్ నుండి శ్రీరంగవరం కుమ్మరి గడ్డకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న తప్పరి మధు (26) సోమవారం మృతిచెందాడు. రోడ్డులో క్రెషర్ మిషన్ కంకర వాహనాల వల్ల ఈద్విచక్ర వాహనం స్కిడ్ అవ్వడంతో చెట్టుని డీ కొనడంతో కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తులు అందరు కలిసి క్రెషర్ మిషన్ పై చర్యలు తీసుకోవాలని పిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోకపోవడం వల్ల ఇలా చేతికందిన యువత నిండు ప్రాణాలు కోల్పోతున్నారు అని అధికారులపై గ్రామస్తులందరు అగ్రం వ్యక్తం చేస్తున్నారు.



## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

### : జిహెచ్ఎంసి కమీషనర్ ఇలంబర్తి

**జీహెచ్ఎంసీ వ్యాప్తంగా ప్రజావాణికి 177 ఆర్జీలు**

**హైదరాబాద్, డిసెంబర్ 23, సిటీ టైమ్స్:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిహెచ్ఎంసి కమీషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. జిహెచ్ఎంసి హెడ్ ఆఫీస్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమీషనర్ పాల్గొని పలు సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన ప్రజల నుండి వారి సమస్యలను ఓపికగా వింటూ అర్జీలను స్వీకరించారు. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ... ప్రజావాణిలో వచ్చిన ఆర్జీలను పరిష్కరించడం పై ఆయా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ సమస్యలు, అనధికార నిర్మాణాలు, పారిశుద్ధ్య నిర్వహణ, కుక్కల సమస్యలు, ఉద్యోగం కల్పించాలని, భూ సేకరణకు సంబంధించిన పరిహారం అందించాలని తదితర సమస్యల పై ఫిర్యాదులు వచ్చాయని, సంబంధిత శాఖల అధికారులు వెంటనే సమస్యల పరిష్కారంపై వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజావాణి ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా 5 విన్నపాలు రాగా, పరిష్కారం నిమిత్తం ఆయా విభాగాలకు పంపించడం జరిగింది. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 62 విన్నపాలు రాగా అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 28, ఇంజనీరింగ్ మెయింటెనెన్స్ 7, ట్యాక్స్, ఎఫ్.ఏ సెక్షన్ లకు 6 చొప్పున, శానిటేషన్, ల్యాండ్ ఆక్యుపేషన్ విభాగాలకు 3 చొప్పున, యు.సి.డి, హెల్త్, వెటర్నరీ విభాగాలకు 2 చొప్పున, యు.బి.డి, హౌసింగ్, అడ్మినిస్ట్రేషన్ విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదులు అందాయి. జిహెచ్ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 115 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్ పల్లి జోన్ లో 41, సికింద్రాబాద్ జోన్ లో 20, శేరిలింగంపల్లి జోన్ లో 22, చార్మినార్ జోన్ లో 6, ఎల్బీనగర్ జోన్ లో 21 విన్నపాలు రాగా ఖైరతాబాద్ జోన్ లో 05 ఫిర్యాదులు అందాయి.ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు సుభద్ర దేవి, నళిని పద్మావతి, పంకజ, అశోక్ సామ్రాట్, చంద్రకాంత్ రెడ్డి, సత్యనారాయణ, రఘు ప్రసాద్, యాదగిరి రావు, వేణు గోపాల్ రెడ్డి, చీఫ్ వెటర్నరీ అధికారి అబ్దుల్ వకీల్, సి.ఎం.హెచ్.ఓ డా.పద్మజ, అడిషనల్ సి.సి.పి లు గంగాధర్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టర్ ప్రజావాణి కి 40 ఫిర్యాదులు..

**ప్రజల నుండి వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించండి...**

**జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి...**

**వనపర్తి బ్యూరో సిటి టైమ్స్ డిసెంబర్ 23:** ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు, అర్జీలను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు, ఆర్డీవో సుబ్రహ్మణ్యంతో కలిసి హాజరై ప్రజల నుంచి అర్జీలు, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో 40 అర్జీలు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, అర్జీలను పరిశీలించి, సత్వర పరిష్కారం చూపేలా సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, వెంటనే పరిష్కరించేలా తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సీఎం, జిల్లా మంత్రి ప్రజావాణి నుంచి వచ్చిన, పెండింగ్ లో ఉన్న అర్జీలను సైతం వారంలో పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.








## 2025-26కు జి హెచ్ ఎం సి బడ్జెట్ రూ. 8,440 కోట్ల బడ్జెట్ కు స్టాండింగ్ కమిటీ ఆమోదం

**హైదరాబాద్, డిసెంబర్ 23, సిటీ టైమ్స్:** 202526 ఆర్థిక సంవత్సరానికి జీహెచ్ఎంసీ రూ. 8,440 కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్ అంచనా ప్రతిపాదనలను సోమవారం జరిగిన ప్రత్యేక బడ్జెట్ సమావేశంలో స్టాండింగ్ కమిటి ఆమోదించింది. నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ప్రత్యేక బడ్జెట్ సమావేశానికి జీహెచ్ఎంసీ కమీషనర్ ఇలంబర్తి, స్టాండింగ్ కమిటీ సభ్యులు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, మహమ్మద్ ముజఫర్ హుస్సేన్, మహమ్మద్ ఖదీర్, మన్నె కవితా రెడ్డి, మహమ్మద్ రషీద్ ఫరాజుద్దీన్, ఉప్పలపాటి శ్రీకాంత్, సబిహ బేగం, చింతల విజయ శాంతి, కంది శైలజ, అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు, గీతా రాధిక, సుభద్ర దేవి, నళిని పద్మావతి, వేణుగోపాల్ రెడ్డి, సత్యనారాయణ, పంకజ, సరోజ, అశోక్ సామ్రాట్, రఘు ప్రసాద్, చంద్ర కాంత్ రెడ్డి, యాదగిరి రావు, జోనల్ కమిషనర్లు అపూర్వ్ చౌహాన్, అనురాగ్ జయంతి, రవికిరణ్, వెంకన్న, ఉపేందర్ రెడ్డి, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వెంకటేశ్వర్ రెడ్డి, ఫైనాన్స్ అడ్వైజర్ శరత్ చంద్ర, సిసిపి శ్రీనివాస్, చీఫ్ వెటర్నరీ అబ్దుల్ వకీల్, సి.ఇ మెయింటెనెన్స్ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. బడ్జెట్ పై స్టాండింగ్ కమిటీ సమావేశంలో విస్తృతంగా చర్చించి ఆమోదించారు. పలు విభాగాలకు సంబంధించి అడిగిన సభ్యుల సందేహాలను ఆయా అధికారులు నివృత్తి చేశారు.

## అంజనగిరి తాండ. చెరువు ముందరి తండాలకు అటవీ శాఖ భూముల్లో రోడ్లు నిర్మిస్తాం..

**జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి...**



**వనపర్తి కలెక్టరేట్ సిటీ టైమ్స్ డిసెంబర్ 23:** వనపర్తి మండల పరిధిలోని అంజనగిరి తండా, చెరువు ముందరి తండాలకు అటవీ భూముల గుండా బీటీ రోడ్లు నిర్మించేందుకు జిల్లా స్థాయి ఫారెస్ట్ కమిటీ ఆమోదించినట్లు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్ లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి ఫారెస్ట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వనపర్తి మండల పరిధిలోని అంజనగిరి తండా, చెరువు ముందరి తండాలకు అటవీ భూముల గుండా బీటీ రోడ్లు నిర్మించేందుకు జిల్లా స్థాయి ఫారెస్ట్ కమిటీ ఆమోదిస్తున్నట్లు చెప్పారు. పిఆర్ రోడ్డు నుంచి అంజనగిరి తండా వరకు బీటీ రోడ్డు వేసేందుకు 0.69 హెక్టార్ల భూమి, అదేవిధంగా చెరువు ముందలి తండాకు వయా పెద్ద తాండ రహదారికి 0.91 హెక్టార్ల అటవీ భూమి కేటాయించేందుకు కమిటీ ఆమోదం తెలిపింది అన్నారు సమావేశంలో జిల్లా అటవీ అధికారి తిరుమల రావు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి బీరం సుబ్బారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సురేష్, గిరిజన శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వర సింగ్ తదితరులు పాల్గొన్నారు.



## పేద విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి...

**జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి...**

**వనపర్తి కలెక్టరేట్ సిటి టైమ్స్ డిసెంబర్ 23:** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం, వారి భవిష్యత్తు కోసం ఎంతో వెచ్చిస్తోందని విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పేర్కొన్నారు.సోమవారం జిల్లా కేంద్రంలోని పీర్లగుట్టలో ఉన్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ సందర్శించారు. వసతి గృహ విద్యార్థినిలకు ప్రభుత్వం ద్వారా మంజూరైన ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్స్, బ్లాంకెట్లను, స్వెటర్లు, రింగ్ బాల్స్, చెస్ మెటీరియల్స్, సహా పలు ఆట వస్తువులను పంపిణీ చేశారు.కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాల్ని, ఈ సదుపాయాలను చక్కగా వినియోగించుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వంటగదిని పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. విద్యార్థులకు భోజనం వడ్డించడానికి ముందు సూపర్వైజర్లు తినాలని, ఆ తర్వాతే విద్యార్థులకు వడ్డించాలని చెప్పారు. హాస్టల్లో స్టాక్ రిజిస్టర్లు తనిఖీ చేసిన కలెక్టర్, మెస్ కమిటీ ఉందా అని సిబ్బందిని అడిగారు. వసతి గృహానికి వంట సామాగ్రి వచ్చినప్పుడు స్టాక్ రిజిస్టర్లో విద్యార్థులచే కచ్చితంగా సంతకం చేయించాలని సూచించారు. తప్పనిసరిగా మెస్ కమిటీ ఉండాలని విద్యార్థులు తమకు వచ్చే ఆహార పదార్థాలు వాటి సామాగ్రిపై పర్యవేక్షణ ఉంచాలన్నారు. వంట సామాగ్రి వచ్చినప్పుడు అది నాణ్యతగా ఉందో లేదో చెక్ చేసిన తర్వాతనే దించుకోవాలి అని సూచించారు.కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి మల్లికార్జున్, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గంధం నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.





## బహుముఖ ప్రజ్ఞాశాలి స్వర్గీయ ప్రధాని పీవీ నరసింహారావు...

**గొప్ప ఆర్థిక సంస్కర్త..**

**వనపర్తి ఎమ్మెల్యే తూడి మేగా రెడ్డి..**

**మాజీ ప్రధాని పివికి వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నివాళులు...**



**వనపర్తి బ్యూరో సిటి టైమ్స్ డిసెంబర్ 23:** వనపర్తి జిల్లా కేంద్రం లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి ఘనంగా నివాళులర్పించారు. వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి మాట్లాడుతూ భారత మాజీ ప్రధాని బహుముఖ ప్రజ్ఞశాలి దివంగత నేత పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది పీవీ నరసింహారావు దేశానికి ఆయన చేసిన సేవలను మరోసారి గుర్తు చేసుకున్నారు సంస్కరణలతో సంక్షోభ కళాని జయించి దేశాన్ని ముందుకు నడిపించిన పాలన సమర్థులు పీవీ నరసింహారావు దేశ ప్రధానిగా ఆయన అమలు చేసిన సంస్కరణలు దేశగతిని మార్చాయి కాంగ్రెస్ పార్టీ పీవీ నరసింహారావు సామర్థ్యాన్ని గుర్తించి దేశ ప్రధానమంత్రిగా నియమించింది అలాంటి గొప్ప నాయకుని వర్ధంతి జరుపుకోవడం ఎంతో గర్వకారణంఈ కార్యక్రమంలో వనపర్తి పట్టణ అధ్యక్షులు వనపర్తి మున్సిపల్ చైర్మన్ మరియు మున్సిపల్ కౌన్సిలర్స్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలోని అన్ని కులాలు మతాలు ప్రభుత్వానికి సమానం...

**బడుగు బలహీన వర్గాల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం..**

**ఏసుప్రభు దైవదూత...**

**రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి చిన్నారెడ్డి**







**వనపర్తి బ్యూరో సిటీ టైమ్స్ డిసెంబర్ 23:** రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాల ప్రజలను, వారి విశ్వాసాలను సమానంగా అదరిస్తుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. జిల్లెల చిన్నా రెడ్డి అన్నారు. డిసెంబర్ 25న యేసు క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం మధ్యాహ్నం ఆలివ్ మెన్నోనైట్ బ్రెట్లం చర్చిలో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో క్రైస్తవులకు ఏర్పాటు చేసిన లవ్ ఫీస్ట్ కార్యక్రమానికి అదనపు కలక్టర్ సంచిత గంగ్వార్ తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 25వ తేదీన యేసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని క్రైస్తవ సోదర సోదరిమణులు కలిసి ఉత్సవాలు జరుపుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాలలో మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో లవ్ ఫీస్ట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. యేసు ప్రభు దైవ దూత అని రోగులను, పాపులను, పీడితులను తన ప్రేమతో నయం చేస్తారని చెప్పారు. తాను జరుసలెం, బ్రేతలాం సందర్శించానని తెలిపారు. క్రిస్టియన్ మిషనరీ ద్వారా గొప్ప విద్యాలయాలు, వైద్య శాలలు ఏర్పాటు చేశారని కొనియాడారు. పిల్లలను బాగా చదించుకోవాలని అప్పుడే అభివృద్ధి సాధిస్తారని సూచించారు. ఆలివ్ యం.బి. చర్చి ప్రాంతంలో ఒకప్పుడు వైద్య శాల, విద్యాలయం ఉండేదని, ప్రస్తుతం ఉన్న పాఠశాలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లాలోని క్రైస్తవ సోదరులకు క్రిస్టమస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి పాస్టర్లకు పంచారు. మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా క్రైస్తవ సోదర సోదరీమణులకు ఏర్పాటు చేసిన భోజనాన్ని అందరితో కలిసి సహా పంక్తి భోజనం చేసారు. అదనపు కలక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, ఆర్డీఓ సుబ్రమణ్యం, మున్సిపల్ చైర్మన్ మహేష్, మాజీ జడ్పి చైర్మన్ ఆర్. లోక్ నాథ్ రెడ్డి, తహసిల్దార్ రమేష్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కృష్ణ, క్రిస్టియన్ సంఘ నాయకులు ప్రసాద్, జయానంద్, జానప్ప, బెంజమిన్, రొనార్డ్, సుకన్య క్రిస్టియన్ సోదరులు అనేక మంది పాల్గొన్నారు.



# సమయానికి రక్తదానం చేసిన యువశక్తి ఫౌండేషన్

**రక్తదానం ప్రాణదానం. యువశక్తి ఫౌండేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గొబ్బూరు నవీన్**

**వనపర్తి టౌన్ సిటీ టైమ్స్ డిసెంబర్ 23:** వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన వెంకటరమణ అనే వ్యక్తి ఆపరేషన్ కోసం సుధా నర్సింగ్ హోమ్ హాస్పిటల్ లో అడ్మిట్ అవ్వడంతో అతనికి బ్లడ్ చాలా తక్కువగా ఉంది వెంటనే అతనికి బి పాజిటివ్ బ్లడ్ ఎక్కించాలని డాక్టర్స్ నిర్ధారించడంతో కుటుంబ సభ్యులు యువశక్తి ఫౌండేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గొబ్బూరు నవీన్ సంప్రదించగా వెంటనే మానవత్వంతో స్పందించి రక్తం ఇప్పించడం జరిగింది. కుటుంబ సభ్యులు యువశక్తి ఫౌండేషన్ కి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువశక్తి ఫౌండేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గుబ్బూరు నవీన్, ఫౌండేషన్ మెంబర్ బాలకృష్ణ, మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# ఘనంగా డాక్టర్ హరిన్ రెడ్డి జన్మదిన వేడుకలు

**కొత్తకోట సిటీ టైమ్స్ డిసెంబర్ 23:** కొత్తకోట మండల కేంద్రంలోని రాహుల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్ రెడ్డి మనుమడు జన్మదిన వేడుకలు ఆయన నివాసంలో ఘనంగా జరిపారు.డాక్టర్ హరన్ రెడ్డికిజన్మదిన వేడుక సందర్భంగా పలు నాయకులు అభినందనలు తెలియజేసి కేక్ కటింగ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బావర్చి మహేష్ యాదవ్, గుంత శివ, రాజకుమార్ , రావుల భరత్, రఘు,యాదగిరి,విజయ్, చంటి తదితరులు పాల్గొన్నారు.



# ఆర్.టి.సి రిటైర్డ్ ఉద్యోగినీ పరామర్శించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**వనపర్తి టౌన్ సిటీ టైమ్స్ డిసెంబర్ 23:** ఆర్.టి.సి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు రామ్ రెడ్డి సతీమణి ఇటీవల గుండె పోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి వారి ఇంటికి (నాగవరం)వెళ్లి పరామర్శించారు. బి.ఆర్.ఎస్ అధికార ప్రతినిధి వాకిటి.శ్రీధర్,పట్టణ అధ్యక్షులు పి.రమేష్ గౌడ్, నందిమల్ల అశోక్ తదితరులు ఉన్నారు.

# నాగారం రాంపల్లి లో నేడు విద్యుత్ సరఫరా లో అంతరాయం

**ఎలక్ట్రిసిటీ ఏఈ ఎస్. మురళీకృష్ణ**

**కీసర, డిసెంబర్ 23, (సిటీ టైమ్స్):** నాగారం పురపాలక సంఘం పరిధిలోని 11 కేవి రాంపల్లి సబ్ స్టేషన్ నుండి 11 కేవి ఆర్ ఎల్ నగర్ రాంపల్లి నాగారం మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు,చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా మంగళవారం ఉదయం 11.00 గంటల నుంచి 4:00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ఎస్. మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ ఆర్ ఎల్ నగర్ మేరకు రాంపల్లి, శ్రీనివాస కాలనీ, ఆర్టీసీ కాలనీ, రిక్వెల్ ఫర్ స్కూల్, ఓయూ కాలనీ, మధురానగర్, కృష్ణారెడ్డి నగర్ కాలనీ, టి పి ఎస్ పుష్ప, ఎల్మోట్ కాలనీ, ప్రకృతి కాలనీ, ఆర్ ఎల్ నగర్, భరత్ నగర్, శ్రీదేవి నగర్, లైన్స్ క్లబ్ హాస్పిటల్, పోచమ్మ గుడి, పెన్నా గోదాం, వాజపేయి రోడ్, ప్రగతి నగర్, గణేష్ నగర్, సంతోష్ నగర్, సూర్యా నగర్, సావిత్రి నగర్, శేషాద్రి నగర్, లక్ష్మీ నగర్, ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.



# బిజెపి మతోన్మాద విధానాలను వ్యతిరేకించండి

**మహాసభలను జయప్రదం చేయాలని ప్రచారం నిర్వహించిన సిపిఎం.**

**పాలకుర్తి, డిసెంబర్ 23, (సిటీ టైమ్స్):** బిజెపి మతోన్మాద విధానాలను వ్యతిరేకించాలని ఈ నెల 27. 28 తేదీలలో స్టేషన్ఘన్పూర్ లో నిర్వహించే సిపిఎం జిల్లా మూడో మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్యాల సోమన్న, మండల నాయకులు సోమసత్యం పిలుపునిచ్చారు. సోమవారం పాలకుర్తి మండలంలోని బొమ్మెర గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో మహాసభల కరపత్రం పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ప్రజల సంపాదన దోచిపెట్టి అదాని ఆస్తులను పెంచే పనిలో కేంద్ర ప్రభుత్వం ఉందని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం పది ఏండ్లుగా పాలిస్తున్న అభివృద్ధి మాట పక్కన పెట్టిఅదాని సేవలో మునిగిపోతున్నారని విమర్శించారు. జెమిని ఎన్నికల వల్ల రాష్ట్రాల ఉనికిని కోల్పోతాయని. కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే జమిలి ఎన్నికలను తెరపైకి తెచ్చారన్నారు. బిజెపి మొదటి నుండి ఆర్ఎస్ఎస్ కనుసనల్లో హిందుత్వ భావజాలాన్ని ప్రజల్లో నింపేదానికోసం పథకం ప్రకారం పని చేస్తున్నారని అనేక సందర్భాలలో తేటతెల్లమైందన్నారు. ఇప్పుడు దేశానికి రాజ్యాంగం పనికిరాదని అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చి మనుధర్మ శాస్త్రాన్ని రాజ్యాంగంలోకి చెప్పించి అమలు చేయడానికి కుట్ర పన్నుతున్నారన్నారు.రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 27 28 తేదీలలో జరిగే మహాసభల్లో గత కార్యక్రమాలను సమీక్షించుకొని భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని. *మొదటి రోజున జరిగే బహిరంగ సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మరియు రాష్ట్ర నాయకులు పాల్గొంటారని.ప్రజలు కార్మికులు రైతులు వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు మాసంపల్లి నాగయ్య, ఏనుగ తల అంజయ్య, పి. సోమయ్య, జి సోమయ్య, ఎం భద్రయ్య, వి. ఐలయ్య, బి యాదగిరి, డి బిక్షం, ఎస్ కొమురయ్య, జి వెంకన్న, ఐలోని, యాదమ్మ, ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.




# 14వ రోజుకు చేరుకున్న సర్వ శిక్ష అభియాన్ సమ్మె...

**ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేసి పే స్కేలు అమలు చేయాలి..**

**ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో వెయిటేజ్ కల్పించాలి..**





**వనపర్తి బ్యూరో సిటీ టైమ్స్ డిసెంబర్ 23:** రాష్ట్రవ్యాప్తంగా సర్వ శిక్ష అభియాన్ లో పనిచేస్తున్న సిబ్బంది గత 14 రోజులు గా సమ్మె చేస్తున్నారు. దీంతో కస్తూరిబా పాఠశాలలతో పాటు ప్రభుత్వ పాఠశాలలను పర్యవేక్షణ చేసే సి ఆర్ పి లు డాటా ఎంట్రీ ఆపరేటర్లు ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే పి టి ఐ లు అందుబాటులో లేక ప్రభుత్వ విద్య ప్రశ్నార్థకంగా మారి అవకాశం ఉంది.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న కస్తూరి బా పాఠశాల లో పనిచేస్తున్న మెజార్టీ సిబ్బంది సమ్మెలో పాల్గొంటున్నడం వల్ల రాబోయే మార్చిలో పదవ తరగతి విద్యార్థులు విద్యాబోధన సరిగా లేక చదువులో వెనకబడి వ్యవస్థ కుంటుపడే అవకాశం ఉంది ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయడంతో పాటు కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల కంటే ముందు ఎస్ ఎస్ ఏ సిబ్బందికి ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రభుత్వం పై సర్వ శిక్ష అభియాన్ సిబ్బందికి అండగా నిలవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.. గత ఎన్నికల కంటే ముందు ప్రతిపక్ష నేత హోదాలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ఎస్ ఎస్ ఏ సిబ్బందికి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు వనపర్తి కలెక్టరేట్ సమీపంలో వనపర్తి జిల్లాలోని దాదాపు 500 మందికి పైగా ఉద్యోగులు ప్రతిరోజు ధర్నాలో పాల్గొంటున్నారు.. దీంతో విద్యావ్యవస్థ స్తంభించిపోయింది..ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష మరియు ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ..14 రోజులుగా ఎంఈఓ మరియు డి ఈ ఓ కార్యాలయ ము మూతపడ్డయని విద్యాశాఖ అడ్మినిస్ట్రేషన్ పూర్తిగా స్థంభించినదని మరియు KGBV, URS, భవిత పాఠశాలలో బోధన బంద్ ఐనది , పాఠశాల విద్యావ్యవస్థ అడ్మినిస్ట్రేషన్ UDISE, AAPAR, MDM ఆన్లైన్ పనులు కుంటుపడుతున్నది. ప్రభుత్వం స్పందించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు గత సంవత్సరం 13092023 న హన్మకొండలోని ఏకశిల పార్క్ దీక్ష శిబిరంలో ఇచ్చిన హామీ మేరకు సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చెయ్యాలని, తక్షణమే పే స్కెల్ అమలు చెయ్యాలని, రీ ఎంగేజ్ విధానం తొలగించి ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ నియామకలలో వెయిటేజ్ కల్పించాలని, హెల్త్ ఇన్సూరెన్స్, ఎక్స్‌గ్రెషియా కల్పించాలని డిమాండ్ చేశారు.ఇప్పటికి అయినా ప్రభుత్వం స్పందించి సంఘ నాయకులను పిలిచి సమస్యలు పరిష్కారం చేయ్యాలని, తక్షణమే పే స్కెల్ అమలు చేస్తామని అసెంబ్లీలో ప్రకటన చేయ్యాలి. లేనిచో మా సమస్యలు తీర్చే వరకు సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె కొనసాగుతది అని అన్నారు. త్వరగా ప్రభుత్వం స్పందించి వెంటనే సమగ్ర శిక్షా ఉద్యోగులని రెగ్యులర్ చేయాలి డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కార్యవర్గం మరియు సమగ్ర శిక్షా ఉద్యోగులు అందరు ఉన్నారు.



# ఎమ్మార్వో ఆఫీస్ నందు బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా

**గ్రామీణ సడక్ యోజన పథకం కింద 3కోట్ల యాభై లక్షలు మంజూరు చేసి మూడు సంవత్సరాలైనా రోడ్డు వేయని వైనం**

**కొత్తకోట సిటీ టైమ్స్ డిసెంబర్ 23:** సీసీ కుంట నుంచి ఉంధ్యాల వరకు 5కిలోమీటర్ల 200 వందల మీటర్ల పి ఆర్ రోడ్డు ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం క్రింద మంజూరు అయ్యి మూడు సంవత్సరాలు అయినా కూడా ఇప్పటి వరకు పనులు పూర్తి కాలేదు.3 కోట్ల యాభై లక్షలు నిధులు మంజూరి జరిగిన ఈ రోడ్డు 2021 సంవత్సరం లో ప్రారంభం జరిగి 2023 లో పనులు కంప్లీట్ కావాలని అగ్రిమెంట్ ఉన్న కూడా అధికారుల నిర్లక్ష్యం మరియు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం తో ఇంకా కిలోమీటరు న్నరా రోడ్డు & డ్యామేజ్ ప్యాచ్ లు మిగిలి ఉన్నాయి.ఈ సారి కురుమూర్తి జాతరకు వచ్చే వేలాది మంది భక్తులు చాలా ఇబ్బందులు పడ్డారు. సీసీ కుంట మండల కేంద్రము కు అనేక ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.కావున పెండింగ్ లో ఉన్న రోడ్డును వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సీసీ కుంట మండల తహశీల్దార్ కార్యాలయం ముందు బీజేపీ ఆధ్వర్యం లో ధర్నా నిర్వహించడం జరిగింది. అయితే తహశీల్దార్ మాట్లాడుతూ పంచాయతీ రాజ్ శాఖ AE గారితో మాట్లాడం జరిగింది. జనవరిలో పనులు ప్రారంభిస్తాం అనీ చెప్పడం తో ధర్నా కార్యక్రమం ముగ్గించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి నంబి రాజు,అసెంబ్లీ కన్వీనర్ రమేష్,మండల అధ్యక్షుడు దశరథ్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ రాము, జిల్లా కార్య వర్గ సభ్యులు రాములు, నంబి శ్రీకృష్ణ, ప్రధాన కార్యదర్శి నరేందర్, మహేష్ ,మండల ఉపాధ్యక్షుడు, బాల్చెందర్ శెట్టి, రుతుకుమార్, మహేందర్ యాదవ్, నరేష్ , దినేష్,తదితరులు పాల్గొన్నారు.






# అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం

**అక్రమ షెడ్లపై ప్రభుత్వం కఠిన చర్యలకు ఇదొక నిదర్శనం...**

**కమిషనర్ భాస్కర్ రెడ్డి**

**నాగారం, డిసెంబర్ 23,(సిటీ టైమ్స్):** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి నుండి చర్లపల్లి వెళ్లే మెయిన్ రోడ్డు అక్రమ కట్టడాలు కడుతున్న వారిపై దృష్టి సారించాలని సిటీ టైమ్స్ న్యూస్ దినపత్రిక లో అక్రమ నిర్మాణాలపై కథనాలతో నాగారం మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకు వచ్చి అక్రమ నిర్మాణం చర్యలు తీసుకోవాల్సిందిగా నాగారం మున్సిపల్ కమిషనర్ పై వత్తిడితో స్పందించి నాగారం మున్సిపల్ కమిషనర్ అక్రమ షెడ్ నిర్మాణాలను సోమవారం నేలమట్టం చేశారు. దీనికి స్థానిక ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. అలాగే నాగారం మున్సిపాలిటీ పరిధిలో ఇలాంటి ఎన్నో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని వాటిపై కూడా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. సిటీ టైమ్స్ దినపత్రిక న్యూస్ కథనానికి స్పందించిన నాగారం మున్సిపల్ కమిషనర్ పలువురు అభినందిస్తూ మిగతా వాటిపై ఇలాంటి చర్యలు తీసుకోవాలని కోరారు.


సిటీటైమ్స్
23 Dec 2024 - Page 3
https://epaper.citytimesdaily.com/clip/42786

రాజీ పడుతున్న...
భాస్కర్ రెడ్డి..!?

నాగారం డిసెంబర్ 22,( సిటీ టైమ్స్ )

అక్రమ నిర్మాణాలకు నాగారం మున్సిపాలిటీ అడ్డాగా మారింది..టౌన్ ప్లానింగ్ అధికారులు కనుసైగల్లోనే అక్రమ నిర్మాణాలు చోటు చేసుకుంటున్నాయి.అక్రమ నిర్మాణాలు జరుగుతున్న ఉన్నతాధికారులు, ఎన్ఫోర్స్మెంట్ అధికారులకు ఫిర్యాదులు అందుతున్న ...ఎందుకు మౌనంగా ఉంటున్నారని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

- పట్టించుకోని మున్సిపల్ కమిషనర్...!?
- కాసులకు అలవాటు పడ్డా డేమో... సారు..!?
- టౌన్ ప్లానింగ్ లో రాజ్యమేలుతున్న







# బలిజపల్లి జిపి ని జంగమయ్యపల్లిలో విలీనం చెయ్యొద్దు..

**మహబూబ్ నగర్ ఖిల్లా గణపురం రోడ్డు పై బైఠాయించి బలిజపల్లి గ్రామస్తుల రాస్తారోకో.**

**మూడు గంటలసేపు ధర్నాతో స్పందించిన రాకపోకలు.. ఇబ్బందులకు గురైన ప్రయాణికులు.**

**పెద్దమందడి సిటీ టైమ్స్ డిసెంబర్ 23:** పెద్దమందడి మండల పరిధిలోని బలిజపల్లి గ్రామాన్ని జంగమయ్య పల్లి గ్రామపంచాయతీలో విలీనం చేయొద్దు అంటూ గ్రామస్తులు రోడ్డుపై బేటాయించి రాస్తారోకో నిర్వహించారు, ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు గ్రామస్తులు రోడ్డుపై బేటాయించడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు సంఘటన స్థలానికి వెంటనే పెద్దమందడి ఎస్సై యుగంధర్ రెడ్డి. మరియు ఘనపూర్ ఎస్సై పోలీసులు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. గత ప్రభుత్వంలో జంట గ్రామాలైన జంగమయ్య పల్లి గ్రామం నుండి బలిజపల్లి గ్రామాన్ని నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు, దీంతో ఇరు గ్రామాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవడం జరిగిందని అన్నారు. మళ్లీ గ్రామపంచాయతీలను ఒకటిగా చేసి రెండు గ్రామాల మధ్యన ఘర్షణ వాతావరణం చోటుచేసుకుందని తెలిపారు, బలిజపల్లి గ్రామపంచాయతీ యధావిధిగా కొనసాగించాలని రోడ్డుపై బెటాయించి రాస్తారోకో చేయడంతో దాదాపు మూడు గంటలసేపు ట్రాఫిక్ జామ్ ఏర్పడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు, దీంతో అధికారులు దారి మళ్ళించారు సంఘటన స్థలానికి పోలీస్ శాఖ తాసిల్దార్ సరస్వతి మాట్లాడుతూ మీ సమస్యలను ఆర్డిఓ కలెక్టర్ లకు నివేదికల అందిస్తామన్నారు అక్కడికి వచ్చిన వనపర్తి ఆర్డీవో తో విలీనం చేయమని ప్రకటన వచ్చేవరకు గ్రామస్తులు ధర్నాలు కొనసాగిస్తామని అన్నారు.

**ఆర్డీవోకు సుబ్రహ్మణ్యం వినతి పత్రం అందజేసిన గ్రామస్తులు**

ఆర్డీవో సుబ్రహ్మణ్యం గ్రామపంచాయతీ విలీనం చేయొద్దు అంటూ ఇచ్చిన వినతి పత్రాన్ని జిల్లాస్థాయి అధికారులకు అందజేస్తామని వారి ఆదేశాల మేరకు నివేదిక అందజేస్తామని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జయంతి. గిరిజాదేవి. గ్రామ నాయకులు శశివర్ధన్ రెడ్డి. సతశిలా రెడ్డి. సంజీవరెడ్డి. నాగరాజు గ్రామపంచాయతీ వార్డు సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# బాక్సింగ్ డే టెస్టు.. భారత్ మూడోసారి సత్తా చాటేనా..?

బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో కీలకమైన బాక్సింగ్ డే టెస్టు కు టీమ్ఇండియా సిద్ధమవుతోంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇప్పటికే 11తో ఇరు జట్లు సమంగా ఉన్న ఈ సిరీస్‌లో.. డిసెంబర్ 26 నుంచి ప్రారంభం కానున్న ఈ టెస్టులో టీమ్ఇండియాకు విజయం ఎంతో అవసరం. గత రెండు బాక్సింగ్ డే టెస్టుల్లో విజయం సాధించిన టీమ్ఇండియా మరోసారి సత్తా చాటాలి. మరి ఆస్ట్రేలియాతో బాక్సింగ్ డే టెస్టులో ఇప్పటివరకూ భారత్ రికార్డులు ఎలా ఉన్నాయో చూద్దాం..

- ఇప్పటివరకూ భారత్ ఆస్ట్రేలియాతో 9 బాక్సింగ్ డే టెస్టుల్లో ఆడగా మిశ్రమ ఫలితాలే లభించాయి. ఇందులో రెండింట్లో మాత్రమే టీమ్ ఇండియా గెలవగా.. ఐదింట్లో ఆసీస్ విజయాలు నమోదు చేసింది. రెండు డ్రాగా ముగిశాయి.
- 1985లో తొలిసారిగా భారత్, ఆస్ట్రేలియా తలపడగా.. ఆ మ్యాచ్ డ్రాగా తేలింది. ఆ తర్వాత జరిగిన ఐదు టెస్టుల్లో ఆసీస్‌దే గెలుపు. 2014లో జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది.
- 2018లో విరాట్ కోహ్లీ నేతృత్వంలో.. బాక్సింగ్ డే టెస్టులో భారత్‌కు తొలిసారి విజయం లభించింది.
- 2020లో అజింక్యా రహానె కెప్టెన్సీలో మరోసారి భారత్ సత్తా చాటింది. 8 వికెట్ల తేడాతో ప్రత్యర్థిపై ఘన విజయాన్ని నమోదు చేసింది. ఈ మ్యాచ్‌లో రహానె అద్భుత శతకం(112)తో రాణించాడు.
- ఇక మెల్‌బోర్న్ వేదికగా భారత్ మొత్తం 14 టెస్టులు ఆడగా.. నాలుగు విజయాలు నమోదు చేసింది. రెండు డ్రాలు, ఎనిమిది అపజయాలు ఉన్నాయి.
- మెల్‌బోర్న్ వైదికపై ఆస్ట్రేలియాతో జరిగన గత రెండు బాక్సింగ్ డే టెస్టుల్లో భారతే విజయం సాధించింది. ప్రస్తుత బోర్డర్ గావస్కర్ ట్రోఫీ కీలక దశకు చేరుకున్న నేపథ్యంలో మరోసారి భారత్ సత్తా చాటాలని అభిమానులు కోరుకుంటున్నారు.
- ఇక మొత్తంగా అన్ని జట్లతో కలిసి భారత్.. 18 బాక్సింగ్ డే టెస్టులు ఆడింది. ఇందులో 4 విజయాలు, మూడు డ్రాలు ఉన్నాయి.
- మెల్‌బోర్న్‌లో కోహ్లీ అదరగొడితే..
- ప్రతిష్ఠాత్మక మెల్‌బోర్న్ మైదానంలో ఆడిన మూడు టెస్టుల్లో విరాట్ కోహ్లీ 52.66 సగటుతో 316 పరుగులు సాధించాడు. అందులో ఓ సెంచరీ, రెండు అర్ధసెంచరీలు ఉన్నాయి. 2014లో ఇక్కడ సాధించిన 169 ఇన్నింగ్స్‌తో విరాట్ పేరు మార్మోగిపోయింది. రెండో ఇన్నింగ్స్‌లోనూ 54 పరుగులతో జట్టుకు ఓటమి తప్పించాడు. ఇదే మైదానంలో విరాట్.. క్రికెట్ చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోయే టీ20 ఇన్నింగ్స్ ఆడాడు. రెండేళ్ల కిందట టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌పై ఛేదనలో 53 బంతుల్లో 82 పరుగులతో జట్టును గెలిపించిన తీరును అభిమానులను ఎప్పటికీ మరిచిపోలేరు. అయితే.. కోహ్లీ ప్రస్తుత ఫామ్ అభిమానులను ఆందోళనకు గురిచేస్తోంది. తనకు అచ్చొచ్చిన పిచ్‌పై మునుపటిలా చెలరేగితే మాత్రం భారత్‌కు తిరుగుండదు.
- 2018లో మెల్‌బోర్న్ వేదికగా జరిగిన టెస్టులో బుమ్రా (6/33) అద్భుత ప్రదర్శన చేశాడు. ప్రస్తుత టోర్నీలో జోరు మీదున్న ఈ స్టార్ పేసర్ మరోసారి బంతితో చెలరేగడం ఖాయమే.
- బాక్సింగ్ డే పేరు ఎలా వచ్చిందంటే..
- 'క్రిస్మస్ బాక్స్' పేరు మీదగా 'బాక్సింగ్ డే' వచ్చింది. క్రిస్మస్ తర్వాత రోజున.. 'క్రిస్మస్ బాక్స్' పేరుతో తమ సేవకులకు వారి యజమానులు డిసెంబర్ 26న బాక్సుల్లో బహుమతులు అందిస్తుంటారు. అందులో ఆహార పదార్థాలతో పాటు నగదు, ఇతర వస్తువులు ఇస్తుంటారు. దీంతో ఆ రోజుని బాక్సింగ్ డే అని పిలవడం ప్రారంభమైంది. అలా కామన్‌వెల్త్ దేశాల్లో బాక్సింగ్ డే పేరు అందరికీ పరిచయమైంది. ఆస్ట్రేలియాలో మెల్‌బోర్న్ వేదికగా బాక్సింగ్ డే (డిసెంబర్ 26) రోజున ప్రారంభమయ్యే మ్యాచ్.. 'బాక్సింగ్ డే టెస్టు'గా స్థిరపడింది.

## ఆసీస్‌తో నాలుగో టెస్టు.. కేఎల్ రాహుల్ ఎదుట అరుదైన ఫీట్

ప్రస్తుత బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో అత్యంత నిలకడగా ఆడుతోన్న భారత క్రికెటర్ కేఎల్ రాహుల్. జట్టులో ఇతర ప్లేయర్లు ఇబ్బందిపడుతున్నప్పటికీ.. ఆసీస్ బౌలింగ్‌ను అద్భుతంగా ఎదుర్కొంటున్నాడు. నాలుగో టెస్టు కోసం ప్రాక్టీస్ చేసే క్రమంలో గాయపడినట్లు వార్తలు వచ్చాయి. అదేమీ పెద్ద సమస్య కాదని బీసీసీఐ వర్గాలూ చెబుతున్నాయి. ఈక్రమంలో కేఎల్ రాహుల్ ఎదుట ఓ అరుదైన ఘనత సాధించే అవకాశం ఉంది. డిసెంబర్ 26 నుంచి ఆసీస్‌తో బాక్సింగ్ డే టెస్టును భారత్ ఆడనుంది. ఈక్రమంలో మూడోసారి బాక్సింగ్ డే టెస్టు బరిలో కేఎల్ దిగనున్నాడు. తాను ఆడిన గత రెండు బాక్సింగ్ డే టెస్టుల్లో కేఎల్ సెంచరీలు బాదాడు. ఇప్పుడీ మ్యాచ్‌లోనూ శతకం చేస్తే భారత స్టార్ బ్యాటర్లు సచిన్ తెందూల్కర్, విరాట్ కోహ్లీకి సాధ్యంకాని ఫీట్‌ను కేఎల్ తన ఖాతాలో వేసుకొనే అవకాశం ఉంది.

**ఆపద్బాంధవుడు.. రాహుల్ కొత్త అవతారం..!**

కేఎల్ రాహుల్ 2014లో భారత్ తరఫున టెస్టుల్లో అరంగేట్రం చేశాడు. ఆ ఏడాది జరిగిన బాక్సింగ్ టెస్టులో సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాడు. కానీ, 2021, 2023లో దక్షిణాఫ్రికాతో రెండు బాక్సింగ్ టెస్టుల్లోనూ సెంచరీలు చేసి తన సత్తా ఏంటో నిరూపించాడు. సెంచూరియన్ వేదికగా జరిగిన ఈ మ్యాచుల్లో 2021లో 123 పరుగులు, 2023లో 101 పరుగులు చేశాడు. ఇప్పుడు మంచి ఫామ్‌లో ఉన్న కేఎల్ మరోసారి సెంచరీ చేసినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఇలా వరుసగా బాక్సింగ్ డే టెస్టులు ఆడి సెంచరీ చేసిన తొలి భారత బ్యాటర్‌గా నిలుస్తాడు. ప్రస్తుత సిరీస్‌లో భారత్ తరఫున అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా కేఎల్ రాహుల్ (235) కొనసాగుతున్నాడు. ఆరు ఇన్నింగ్స్‌ల్లో రెండు హాఫ్ సెంచరీలు చేయడంతోపాటు విలువైన పరుగులు సాధించాడు.



## టీమ్ఇండియాకు పాత పిచ్‌లు.. ఆసీస్‌కు కొత్తవా? క్యూరేటర్ వివరణ ఇదే..

బోర్డర్ గావస్కర్ ట్రోఫీలోని నాలుగో టెస్టు కోసం టీమ్ ఇండియా, ఆస్ట్రేలియా సిద్ధమవుతున్నాయి. బాక్సింగ్ డే టెస్టు కోసం టీమ్ఇండియా ఆటగాళ్లు మెల్‌బోర్న్ స్టేడియంలో చెమటోడుస్తున్నారు. నాలుగో మ్యాచ్‌లో విజయం సాధించి సిరీస్‌లో ఆధిక్యం సంపాదించాలని పట్టుదలగా ఉన్నారు. అయితే.. ప్రాక్టీస్ వేళ ఓ వివాదం ప్రచారంలోకి వచ్చింది. టీమ్ఇండియా ఆటగాళ్ల ప్రాక్టీస్ కోసం ఉపయోగించిన పిచ్‌లను ఇచ్చారని.. ఆస్ట్రేలియా ఆటగాళ్లు మాత్రం కొత్త పిచ్‌పై సాధన చేస్తున్నారని.. ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. దీనిపై మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ క్యూరేటర్ వివరణ ఇచ్చాడు. గత వారాంతంలో టీమ్ఇండియా ఆటగాళ్లు ఎంసీజీలో ప్రాక్టీస్ మొదలుపెట్టారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్‌తో పాటు పేసర్లు బుమ్రా, సిరాజ్, ఆకాశ్ దీప్ సాధన ప్రారంభించారు. అయితే.. పిచ్‌లో బంతి చాలా తక్కువ బౌన్స్ అయ్యిందని.. షార్ట్ పిచ్ బంతులు కూడా నడుము వరకే వచ్చాయని సమాచారం. పిచ్ స్వభావం కారణంగా రోహిత్ మోకాలికి కూడా దెబ్బ తగిలినట్లు వార్తలు వచ్చాయి. ఇది వైట్ బాల్ కోసం వినియోగించిన పాత్ పిచ్ అయి ఉంటుందని ఆకాశ్ దీప్ కూడా పేర్కొన్నాడు. మరోవైపు ఆస్ట్రేలియా ప్రాక్టీస్ కోసం సిద్ధం చేసిన



పిచ్‌లు భిన్నంగా కనిపించాయి. పిచ్ తాజాగా ఉన్నట్లు ఫొటోలు దర్శనమిచ్చాయి. అయితే.. ఈ రెండు భిన్న పిచ్‌లపై ప్రశ్నించగా.. క్యూరేటర్ మ్యాట్ పేజ్ వివరణ ఇచ్చాడు. నిబంధనల ప్రకారం.. మ్యాచ్ ప్రారంభానికి మూడు రోజుల ముందు మాత్రమే కొత్త పిచ్ అందుబాటులోకి వస్తుందని తెలిపాడు. "టీమ్ఇండియా ప్రాక్టీస్ షెడ్యూల్ మాకు చాలా ముందుగానే వచ్చింది. అయితే.. మ్యాచ్ సెంట్రిక్ పిచ్‌లు మూడు రోజుల ముందు మాత్రమే ఇస్తాం. ఇది అన్ని జట్లకూ వర్తిస్తుంది" అని పేర్కొన్నాడు. సోమవారం ఆస్ట్రేలియా జట్టు ప్రాక్టీస్ కోసం మొదటిసారిగా వచ్చి కొత్త పిచ్‌పై సాధన మొదలు పెట్టింది. భారత్ తదుపరి ప్రాక్టీస్ సెషన్‌కు కొత్త పిచ్ అందుబాటులో ఉంటుందని క్యూరేటర్ తెలిపాడు.

## మహిళల ఛాంపియన్‌షిప్ టైటిల్ విజేతగా ఆసీస్..

ఐసీసీ మహిళల ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో భారత్ మూడో స్థానానికి చేరుకుంది. విండీస్‌పై తొలి వన్డేలో ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ టైటిల్‌ను మాత్రం ఆస్ట్రేలియా తాజాగా సొంతం చేసుకుంది. న్యూజిలాండ్‌తో జరిగిన మూడో వన్డేలో 75 పరుగుల తేడాతో ఆసీస్ విజయం సాధించింది. దీంతో 24 మ్యాచుల ఐసీసీ ఛాంపియన్‌షిప్‌లో అత్యధిక పాయింట్లు సాధించి మూడోసారి ఆసీస్ ఛాంపియన్‌గా నిలిచింది. ఇప్పుడీ మ్యాచ్‌తో ఆసీస్ , న్యూజిలాండ్ తమ 24 వన్డేల కోటాను పూర్తి చేసుకున్నాయి. భారత్‌కు ఇంకా 5, బంగ్లాదేశ్ 3, వెస్టిండీస్‌కు 5, ఐర్లాండ్‌కు మూడు చొప్పున మ్యాచ్‌లు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న పాయింట్ల ప్రకారం ఆసీస్‌ను అధిగమించే అవకాశం మరే జట్టుకూ లేదు. మహిళా క్రికెట్‌ను మరింత విస్తరించి అభివృద్ధి చేసేందుకు ఐసీసీ ప్రతి మూడేళ్ల సీజన్ కోసం వన్డే ఛాంపియన్‌షిప్‌ను నిర్వహిస్తోంది. ఈ ఛాంపియన్‌షిప్‌లో తొలి ఆరు స్థానాల్లో నిలిచిన జట్లు వన్డే ప్రపంచ కప్ టోర్నీకి నేరుగా అర్హత సాధిస్తాయి. ఒకవేళ టాప్ 6లో లేకపోతే క్వాలిఫయర్ మ్యాచ్‌లను ఆడి వరల్డ్ కప్ బరిలో దిగాల్సి ఉంటుంది. ఈ సీజన్‌లో ప్రతి జట్టూ 24 వన్డేలను ఆడాలి. అందులో ఎక్కువ పాయింట్లు సాధించిన జట్టుకు ఛాంపియన్‌షిప్ టైటిల్ దక్కుతుంది. ఒక్కో మ్యాచ్ గెలిస్తే రెండు పాయింట్లు, ఎలాంటి ఫలితం రాకపోతే ఒక పాయింట్ ఆయా జట్లకు వస్తాయి.



**టాప్ -6లో నిలిచిన జట్లు**

**ఆస్ట్రేలియా (39 పాయింట్లు) :** 24 మ్యాచుల్లో 18 విజయాలు సాధించింది. మూడు మ్యాచుల్లో ఎలాంటి ఫలితం రాలేదు.

**ఇంగ్లండ్ (32 పాయింట్లు):** 24 మ్యాచుల్లో 15 విజయాలను నమోదు చేసింది. ఏడు మ్యాచుల్లో ఓటమి పాలైంది. రెండింట్లో ఎలాంటి ఫలితం రాలేదు.

**భారత్ (27 పాయింట్లు):** 19 మ్యాచుల్లో 13 విజయాలు, ఐదు ఓటములు. ఒక మ్యాచ్ టై.

**దక్షిణాఫ్రికా (25 పాయింట్లు):** 24 మ్యాచుల్లో 12 విజయాలు, 11 ఓటములు, ఒక మ్యాచ్ ఫలితం తేలలేదు.

**శ్రీలంక (22 పాయింట్లు):** 24 మ్యాచుల్లో 9 విజయాలు, 11 ఓటములు. నాలుగు మ్యాచుల్లో ఫలితం తేలలేదు.

**న్యూజిలాండ్ (21 పాయింట్లు):** 24 మ్యాచుల్లో 9 విజయాలు, 12 ఓటములు, మూడు మ్యాచుల్లో రద్దు బంగ్లాదేశ్ (19 పాయింట్లు), వెస్టిండీస్ (14 పాయింట్లు) వెనుకబడినప్పటికీ.. ఇంకా ఆ జట్లకు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. ఆ వన్డేలను అన్నింటిని గెలిస్తే టాప్ 6లోకి వచ్చే అవకాశం లేకపోలేదు. అప్పుడు శ్రీలంక, న్యూజిలాండ్‌కు ఇబ్బంది ఎదురయ్యే పరిస్థితి ఉంది.

## ఆ మైలురాళ్ల ముంగిట : బుమ్రా 6 తీస్తే.. స్మిత్ 191 కొడితే..!

డిసెంబర్ 26 నుంచి ప్రారంభం బాక్సింగ్ డే టెస్టు ప్రారంభం కానుంది. పలు కీలక మైలురాళ్లు ఆటగాళ్ల ముందు ఉన్నాయి.

బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో భాగంగా బాక్సింగ్ డే టెస్టుకు టీమ్ఇండియా, ఆస్ట్రేలియా సిద్ధమవుతున్నాయి. ఇరు జట్ల ఆటగాళ్ల ముందు పలు రికార్డులు ఊరిస్తున్నాయి. ముఖ్యంగా టీమ్ఇండియా స్టార్ పేసర్ బుమ్రా, ఆసీస్ సీనియర్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ ముందు కీలక లక్ష్యాలు ఉన్నాయి. ఈ టోర్నీలో టీమ్ఇండియా పేస్ దళాన్ని ముందుండి నడిపిస్తున్న బుమ్రా.. మరో ఆరు వికెట్లు తీస్తే 200 టెస్టు వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో చేరుతాడు. ఇప్పటి వరకూ ఈ జాబితాలో ఐదుగురు భారత పేసర్లు మాత్రమే ఉన్నారు. కపిల్ దేవ్, ఇషాంత్ శర్మ, జవగళ్ శ్రీనాథ్, జహీర్ ఖాన్, మహ్మద్ షమీ మాత్రమే ఈ ఘనత సాధించారు. మొత్తంగా 11 మంది భారత బౌలర్లు ఈ మైలురాయికి చేరుకున్నారు. ఇక ఈ టోర్నీలో అద్భుతంగా రాణిస్తున్న బుమ్రా.. ఈ రికార్డుకు చేరుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. ఇక ఆసీస్ సీనియర్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ ముందు మరో రికార్డు ఉంది. ఇంకో 191 పరుగులు చేస్తే.. టెస్టుల్లో పది వేల పరుగులు చేసిన వారి జాబితాలో చేరనున్నాడు. ఈ ఘనత సాధిస్తే.. నాలుగో ఆస్ట్రేలియా బ్యాటర్‌గా అతడు అవతారమెత్తనున్నాడు. ఆ జట్టు నుంచి అలన్ బోర్డర్, స్టీవ్ వా, రికీ పాంటింగ్ మాత్రమే ఈ జాబితాలో ఉన్నారు. ఇక మూడో టెస్టులో ట్రావిస్ హెడ్‌తోపాటు సెంచరీ



నమోదు చేసిన స్మిత్‌కు ఈ మైలు రాయి చేరుకోవడం సులువే. మరోవైపు 2014లో ఇదే మెల్‌బోర్న్ మైదానంలో స్మిత్ భారత్‌పై 192 పరుగులు చేసి ఆ టెస్టు డ్రా కావడంలో కీలకంగా నిలిచాడు. ప్రఖ్యాత మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ వేదిక (MCG)గా డిసెంబర్ 26 నుంచి నాలుగో టెస్టు ప్రారంభం కానుంది. బాక్సింగ్ డే టెస్టుగా పిలుచుకునే ఈ మ్యాచ్‌లో విజయం ఇరు జట్లకూ ఎంతో కీలకం. ఇప్పటికే ఇరు జట్లు 11తో సమంగా ఉన్నాయి. మూడో టెస్టు డ్రాగా ముగిసిన విషయం తెలిసిందే.

## విజయ్ హజారే ట్రోఫీ.. దంచికొట్టిన రుతురాజ్ గైక్వాడ్, ఇషాన్ కిషన్

మరో ఎనిమిది వారాల్లో ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభంకానుంది. ఈ మెగా టోర్నీ కోసం త్వరలోనే జట్టును ప్రకటించనున్నారు. దీంతో జట్టులో చోటు దక్కించుకోవాలనే లక్ష్యంతో విజయ్ హజారే ట్రోఫీ(వన్డే)లో కొంతమంది భారత ఆటగాళ్లు అదరగొడుతున్నారు. ఇప్పటికే ముంబయి కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఓ శతకం చేయగా.. తాజాగా రుతురాజ్ గైక్వాడ్,ఇషాన్ కిషన్‌లు భారీ సెంచరీలు బాదేసి సెలక్టర్ల దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. సోమవారం సర్వీసెస్‌తో జరిగిన మ్యాచ్‌లో మహారాష్ట్ర కెప్టెన్ రుతురాజ్ (148*; 74 బంతుల్లో 16 ఫోర్లు, 11 సిక్స్‌లు) విధ్వంసం సృష్టించాడు. 57 బంతుల్లోనే మూడంకెల స్కోరు అందుకున్న గైక్వాడ్ తర్వాత మరింత దూకుడుగా ఆడాడు. దీంతో సర్వీసెస్ నిర్దేశించిన 206 పరుగుల మోస్తరు లక్ష్యాన్ని ముంబయి ఒక వికెట్ కోల్పోయి 20.2 ఓవర్లలోనే ఛేదించింది.తొలుత బ్యాటింగ్ చేసిన సర్వీసెస్ 48 ఓవర్లలో 204 పరుగులకు ఆలౌటైంది. మోహిత్ అహ్లావత్ (61) టాప్ స్కోరర్. సురజ్ (22),రజత్ పలివాల్ (22), అర్జున్ శర్మ (24), పూనమ్ పూనియా (26) పరుగులు చేశారు. మహారాష్ట్ర బౌలర్లలో ప్రదీప్ 3, సత్యజిత్ 3, ముకేశ్ చౌదరి 2, రజనీష్ గుర్బానీ, అజీమ్ కాజీ ఒక్కో వికెట్ పడగొట్టారు.



**ఇషాన్ కిషన్ 64 బంతుల్లో**

మణిపూర్‌తో జరిగిన మ్యాచ్‌లో ఝార్ఖండ్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన మణిపుర్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 253 పరుగులు చేసింది. ఝార్ఖండ్ కెప్టెన్ ఇషాన్ కిషన్ (134; 78 బంతుల్లో 16 ఫోర్లు, 6 సిక్స్‌లు) శతకంతో విరుచుకుపడ్డాడు. దీంతో ఆ జట్టు 28.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. ఇషాన్ 64 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఉత్కర్ష్ సింగ్ (68) రాణించాడు.

## మనుబాకర్‌కు దక్కని చోటు.. 'ఖేల్ రత్న' నామినేషన్లపై వివాదం..!

పారిస్ ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించి భారత పతాకాన్ని రెపరెపలాడించిన షూటర్ మను బాకర్. వ్యక్తిగత, మిక్స్‌డ్ డబుల్స్‌లో పతకాలను దక్కించుకుంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఒకే ఒలింపిక్స్‌లో రెండు మెడల్స్‌ను సాధించిన తొలి అథ్లెట్‌గా నిలిచి చరిత్ర సృష్టించింది. అయితే, తాజాగా ఖేల్ రత్న అవార్డుల కోసం నామినేషన్ల జాబితాలో ఆమెకు చోటు దక్కలేదని వార్తలు వస్తున్నాయి. ఇదే ఇప్పుడు క్రీడావర్గంలో తీవ్ర చర్చకు దారితీసింది. మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డు కోసం కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ జాబితాను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఇందులో మనుబాకర్ పేరు లేదని సోషల్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. అయితే, అధికారిక వర్గం మాత్రం మను బాకర్ అసలు దరఖాస్తు చేయలేదని ఓ ప్రకటన ఇచ్చింది. దీనిపై మను తండ్రి స్పందిస్తూ.. క్రీడా అత్యున్నత పురస్కారం కోసం తాము అప్లికేషన్ పంపినట్లు వెల్లడించారు. 12 మందితో కూడిన జాతీయ స్పోర్ట్స్ డే కమిటీ మాత్రం మనుబాకర్‌కు అవకాశం ఇవ్వనట్లు తెలుస్తోంది. "ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన అథ్లెట్ కూడా అవార్డుల కోసం అడగాలా? ప్రభుత్వంలోని ఓ అధికారి నిర్ణయించారు. కమిటీ సభ్యులు సైలెంట్ అయిపోయారు. ఇదేనా మీరు అథ్లెట్లను ప్రోత్సహించే పద్ధతి? నాకు అస్సలు అర్థంకావడం లేదు. మేం పురస్కారం కోసం దరఖాస్తు చేశాం.



కానీ, కమిటీ నుంచి ఎలాంటి ప్రతిస్పందన రాలేదు. ఇలాగైతే తమ పిల్లలను క్రీడల్లో పాల్గొనమని తల్లిదండ్రులు ఎలా ప్రోత్సహిస్తారు? వారిని కూడా ఐఆర్ఎస్ లేదా ప్రభుత్వ ఉద్యోగిగా మారమని చెబుతారు" అని మను తండ్రి రామ్‌కిషన్ బాకర్ వెల్లడించారు. మన బాకర్‌కు 2020లో అర్జున అవార్డు వరించింది. మను బాకర్ దరఖాస్తు చేయలేదని అధికారులు పేర్కొంటున్నవేళ.. మహ్మద్ షమీ విషయాన్ని క్రీడాభిమానులు గుర్తుచేస్తున్నారు. షమీ దరఖాస్తు చేయకపోయినా ఈ ఏడాది అర్జున అవార్డుతో కేంద్రం సత్కరించింది. గత వన్డే ప్రపంచకప్‌లో భారత్ ఫైనల్‌కు చేరడంలో కీలక పాత్ర పోషించడంతోపాటు క్రికెట్‌కు అందించిన సేవలకుగాను పురస్కారం దక్కింది. బీసీసీఐ ప్రత్యేకంగా సిఫార్సు చేసింది. ఇప్పుడు కూడా మనుబాకర్ విషయంలోనూ షూటింగ్ సమాఖ్య దృష్టిసారించాలనే డిమాండ్లూ వస్తున్నాయి. బయటకు వెల్లడైన జాబితా ప్రకారం.. హాకీ ప్లేయర్ హర్మన్‌ప్రీత్ సింగ్, పారా అథ్లెట్ ప్రవీణ్ కుమార్ ఉన్నట్లు తెలుస్తోంది.



# హారర్ ప్రపంచంలోకి రష్మిక..

'పుష్ప 2'తో శ్రీవల్లిగా థియేటర్లలో సందడి చేస్తోంది కథానాయిక రష్మిక. ప్రస్తుతం చేతినిండా సినిమాలతో తీరిక లేకుండా గడుపుతున్న ఈ భామ.. బాలీవుడ్‌లో 'థామా' అనే సినిమా చేస్తోన్న సంగతి తెలిసిందే. ఆమె, ఆయుష్మాన్ ఖురానా జంటగా నటిస్తున్న చిత్రమిది. దినేశ్ విజన్ హారర్ యూనివర్స్‌లో భాగంగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని ఆదిత్య సర్పోత్దార్ తెరకెక్కిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా సెట్లోకి అడుగుపెట్టిన రష్మికపై పరిచయ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఉత్కంఠభరితమైన ప్రేమకథగా రూపొందుతున్న ఈ చిత్రంలో ఆమె మునుపెన్నడూ పోషించని పాత్రలో కనిపించనుంది. ప్రస్తుతం దిల్లీలో జరుగుతున్న ఈ సినిమా షూటింగ్‌లో మరికొద్ది రోజుల్లో నవాజుద్దీన్ సిద్ధిఖీ పాల్గొననున్నట్లు సమాచారం. దీని తదుపరి షెడ్యూల్‌ను ఫిబ్రవరిలో ఊటీలో మొదలు కానున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. వచ్చే ఏడాది దీపావళికి విడుదల కానుందీ చిత్రం. ప్రస్తుతం రష్మిక జాబితాలో 'ది గర్ల్‌ఫ్రెండ్', 'కుబేర', 'సికందర్' తదితర చిత్రాలున్నాయి.

# జైలర్ 2 సన్నాహాలు

టైగర్ కా హుకుమ్ అంటూ 'జైలర్' సినిమాలో అగ్రకథానాయకుడు రజనీకాంత్ చేసిన హంగామా ప్రేక్షకులను మెప్పించింది. నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కించిన ఈ సినిమా గతేడాది విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. ఈ క్రైమ్ థ్రిల్లర్‌కు కొనసాగింపుగా 'జైలర్ 2' రాబోతున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమా చిత్రీకరణను మార్చిలో మొదలు పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో రజనీని తొలి భాగం కన్నా మరింత స్టైలిష్‌గా చూపించనున్నారని, త్వరలో చిత్రీకరణ గురించి అధికారికంగా ప్రకటించనున్నారని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం రజనీకాంత్ 'కూలీ' సినిమాతో బిజీగా ఉన్నారు.





# 'కిక్ 2' త్వరలో

భిన్నమైన కథలను ఎంచుకుంటూ సినీ ప్రియులను మెప్పించడంలో ముందు వరసలో ఉంటారు బాలీవుడ్ అగ్రకథానాయకుడు సల్మాన్ ఖాన్. ప్రస్తుతం ఆయన 'సికందర్' చిత్రీకరణలో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న సల్మాన్ 'కిక్ 2' ఆలస్యం గురించి స్పందిస్తూ.. "చాలా కాలం తర్వాత సాజిద్ నడియాడ్ వాలాతో కలిసి పనిచేస్తున్నందుకు సంతోషంగా ఉంది. మళ్లీ మా కాంబినేషన్‌లో 'కిక్ 2' రూపొందనున్న సంగతి తెలిసిందే. ఈ సీక్వెల్ చిత్రాన్ని తెరకెక్కించడానికి ఎందుకు ఇంత సమయం తీసుకున్నారంటూ అభిమానులు నన్ను అడుగుతూనే ఉన్నారు. ప్రస్తుతం మేము ఈ సినిమా పనుల్లోనే ఉన్నాం. స్క్రిప్ట్ ముగింపు దశలో ఉంది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో అధికారికంగా ప్రకటించనుంది చిత్రబృందం" అని అన్నారు.



# మర్రిచెట్టు జ్ఞాపకాలు...

ప్రమోద్ దేవా, రణధీర్, కీర్తన స్వర్గం, ముస్కాన్ రాజేందర్ నాయకానాయికలుగా తెరకెక్కుతున్న చిత్రం 'మర్రిచెట్టు కింద మనోళ్ళు'. నరేశ్ వర్మ ముద్దం దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీనారసింహ చిత్రాలయ సంస్థ నిర్మిస్తోంది. ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభమైందీ చిత్రం. ముహూర్తపు సన్నివేశానికి సీనియర్ నటుడు బాబు మోహన్ క్లాప్‌నిచ్చారు. నటులు నాగమహేశ్ కెమెరా స్విచ్చాన్ చేశారు. థర్టీ ఇయర్స్ పృథ్వీ, రాజీవ్ కనకాల, కె.ఎల్.దామోదర్ ప్రసాద్, సి.కల్యాణ్, రష్మీ ఠాగూర్ తదితర సినీ ప్రముఖులు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. దర్శకుడు నరేశ్ వర్మ ముద్దం మాట్లాడుతూ "జీవితంలో ప్రతి ఒక్కరికీ ఊళ్లోని మర్రిచెట్టుతో ముడిపడిన జ్ఞాపకాలు ఉంటాయి. ఆ నేపథ్యంలో రూపొందనున్న చిత్రమిది. పేరుకి మంచి స్పందన లభించింది" అన్నారు.



# జర్నలిస్టు నుంచి పోలీసు అధికారిగా..?

ఇటీవలే 'డిస్పాచ్' చిత్రంలో అవినీతిని బయటపెట్టే జర్నలిస్టుగా ప్రేక్షకులను ఆకట్టుకున్న బాలీవుడ్ అగ్ర నటుడు మనోజ్ బాజ్పేయీ... ఇప్పుడు తన రాబోయే సినిమా కోసం పోలీసు అధికారి అవతారమెత్తనున్నారు. ఆయన ప్రధాన పాత్రలో రూపొందుతున్న చిత్రం 'ఇన్‌స్పెక్టర్ జెండే'. యాక్షన్, కామెడీ నేపథ్యంలో తెరకెక్కనున్న చిత్రమిది. దీనిని రెట్రోఫైల్స్ సంస్థ నిర్మించనుంది. ఈ సినిమాతో మరాఠీ నటుడు చిన్మయ్ మాండ్లేకర్ దర్శకుడిగా పరిచయం కానున్నారు. ప్రస్తుతం శరవేగంగా స్క్రిప్ట్ పనులు పూర్తి చేసుకుంటున్న ఈ చిత్రం జనవరిలో చిత్రీకరణను ప్రారంభించుకోనుంది. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో అధికారికంగా ప్రకటించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.

# ఆ రెండు చిత్రాల సీక్వెల్స్ ఖరారు

విజయవంతమైన కథలతో దర్శకుడిగానూ, నిర్మాతగానూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు విధు వినోద్ చోప్రా. ఇటీవలే ఆయన తెరకెక్కించిన 'ట్వెల్త్ ఫెయిల్' సినీ ప్రియులను విశేషంగా ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. హిందీ ప్రేక్షకుల మనసుల్ని గెలుచుకున్న 'మున్నాభాయ్ 2', '3 ఇడియట్స్'కు సీక్వెల్స్ రాబోతున్నట్లు గత కొన్ని రోజులగా వార్తలొస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న వినోద్ చోప్రా.. రాబోయే ఈ కొనసాగింపు చిత్రాల గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకున్నారు. "నాకెరీర్‌లో నేను ఎక్కువగా ఇష్టపడే చిత్రాలు 'మున్నాభాయ్ 2', '3 ఇడియట్స్'. అభిమానులు ఈ సినిమా సీక్వెల్స్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని నాకు తెలుసు. ప్రస్తుతం నేను ఆ పనుల్లోనే ఉన్నాను. ఈ సినిమాలకు సంబంధించిన స్క్రిప్ట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మునుపటి కంటే రెట్టింపు వినోదాన్ని పంచడానికి త్వరలో ఈ సినిమాలు ప్రేక్షకుల ముందుకు రానున్నాయ"ని అన్నారు.





# పోరాడుతూ మరణించాలంతే!

"తల్లి ఆశీర్వాదం బిడ్డకు ఎప్పుడూ తోడుంటుందంటారు. కానీ నా బిడ్డ విషయంలో మాత్రం అది శాపంగా మారింది" అంటోంది ఓ తల్లి. మరి ఆమె ఆశీర్వాదం తన బిడ్డకు ఎందుకు శాపంగా మారిందో తెలుసుకోవాలంటే 'గాంధారి' సినిమా చూడాల్సిందే. బాలీవుడ్ కథానాయిక తాప్సి ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. దేవాశిశ్ మఖిజా తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ మొదలైనట్లు తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఫొటోల్ని పంచుకుంది తాప్సి. "సమయం వచ్చినప్పుడు నేను యుద్ధరంగంలో వీరోచితంగా పోరాడుతూ మరణించాలి. కానీ ఎప్పుడూ శత్రువుల ముందు భయం ప్రదర్శించొద్దు. ఇప్పుడు పోరాటం ప్రారంభిద్దాం" అని వ్యాఖ్యల్ని జోడించింది. ఇందులో ప్రతీకారం తీర్చుకునే ఓ శక్తిమంతమైన తల్లిగా కనిపించనుందామె. ఈ చిత్రాన్ని కనికా ధిల్లాన్ నిర్మిస్తోంది. త్వరలో విడుదల తేదీని ప్రకటించనున్నట్లు తెలిపింది చిత్రబృందం.

Printed, Published and Owned by B.PRAMOD KUMAR, B258, Phase1, Vanasthalipuram, Hyderabad70. Printed at Garuda Printers, Plot No.91, Sri Ramnagar Colony, Kharmanghat, Hyderabad500035, Telangana.
Published at H.No. B258, Phase1, Vanasthalipuram, Hyderabad500070, Telangana. Editor: N.Ramakrishna Reddy, email: citytimestd@gmail.com, RNI: APTEL/2001/5896